ఉరి తీసిన శవం!

సికిందర్

సైలార్క్ రెస్టారెంట్ ఆరవ నెంబర్ కేబిన్‌లోకి లాల్ స్వింగ్ డోర్ తోసుకొని వెళ్ళి, "హాలో, మీరొచ్చేశారన్న మాట!" అన్నాడు.

జగపతిరావ్ ఉలికిపడి చూసి, "మీరు నిజంగా భయ పెట్టేశారు!" అన్నాడు.

లాల్ నవ్వుతూ అతనెదురుగా కుర్చీలో కూర్చు న్నాడు.

"ఈ లోకంలో భయపడేవారిద్దరు: తప్పు చేసేవాళ్ళు, చేసి తప్పించుకున్న వాళ్ళు."

రావ్ ఇబ్బందిగా కదిలి, "నిజంగా ఈ చోటు రహ స్యంగా వుంటుందా, మిస్టర్ లాల్?" అన్నాడు.

లాల్ తలూపాడు. "మీరిక్కడ నన్ను కలుసు కున్నట్లు ఎవరికీ తెలియదు. ఈ హోటల్ స్టాఫ్ అంతా నాకు తెలుసు. నమ్మకమైన వాళ్ళు. రహస్యాలు వుంచు తారు. ఇప్పుడు చెప్పండి, మీకొచ్చిన ఆపదేమిటి?"

రావ్ చెప్పబోయి వెయిటర్ లోనికి రావడంతో మానుకున్నాడు. లాల్ రెండు కాఫీలకి ఆర్డరిచ్చి వెయిటర్‌ని నిరుత్సాహపర్చాడు. కానీ టిప్ అందుకుంటున్నప్పుడు ముఖం చాటంతవుతుందని తెలుసు లాల్‌కి.

రావ్ అన్నాడు: "మిస్టర్ లాల్, నేను బ్లాక్ మెయిల్‌లో ఇరుక్కున్నాను. ఇది మీకు సామాన్యమనిపించవచ్చు, రొటీన్‌గా తోచవచ్చు. కానీ నా చేతి నుంచి అయిదు లక్షలు ఆముదంలా వదిలేలా వున్నాయి. దీన్ని మీరాపాలి."

లాల్ నవ్వాడు, "ఏం బ్లాక్ మెయిల్?"

"ఇందాక ఫోటోలందాయి...."

"ఏం ఫోటోలు?"

"నా ఫోటోలు—మాధురితో కలిసివున్న ఫోటోలు."

"ఆమె ఎవరు? మీ భార్యా?"

"ఓహ్, కాదు! కాల్ గర్ల్."

"ఐ సీ.... ప్రతీ పాపం ఓ శిక్షను వెంట తెస్తుందనుకొంటాను."

"మిమ్మల్ని యిన్నుకుంది నీతులు నేర్పడానిక్కాదు!"

"మరెందుకో చెప్పండి."

"వాడు ఇందాక ఫోన్ చేసి రేపు రాత్రికల్లా అయిదు లక్షలు సిద్ధం చెయ్యమన్నాడు. రాత్రి 11 గంటలకి కార్లో లోయర్ టాంక్‌బండ్ రోడ్డుమీదగా వెళ్తూ, వాడు తర్వాత చెప్పే నిర్ణీతస్థలంలో బ్రీఫ్‌కేసు జారవిడవాలట."

"తర్వాత?"

"వెనక్కి చూడకుండా తిన్నగా వెళ్ళిపోమ్మన్నాడు,

డబ్బు సక్రమంగా వుంటే తెల్లారి నెగటివ్స్ అందు తాయట."

"బావుంది. అయితే మమ్మల్నేం చెయ్యమంటారు?"

"ఆ సమయాని కక్కడ మాటువేసి వాడి మక్కెలిర గొట్టమంటాను!" అర్చాడు రావ్.

"ఉష్.... అరవకండి! ప్రైవసీ దెబ్బతింటుంది" లాల్ వారించాడు, "బ్లాక్ మెయిలర్ అంత అజాగ్రత్తగా వుండడు. నెగటివ్స్ ఎక్కడున్నాయో మనకి తెలియదు. ఒకవేళ అతన్ని పట్టుకుంటే, ఆ నెగటివ్స్ బట్టబయలై మీరు వీధిపాలయ్యే ఏర్పాటు ఏదైనా చేశాడేమో తెలియదు. కాబట్టి అలా చివరి క్షణంలో అతన్ని పట్టుకోడం మంచిది కాదు."

"అయితే ఏం చేస్తారు? యెప్పుడు పట్టుకొంటారు?"

"ముందు అతన్ని ట్రేస్ చెయ్యగలమేమో చూడాలి. రేపు రాత్రిలోగా పట్టుకోవాలి. పట్టుకున్నామంటే బోనులో పడి దిక్కులు చూడ్డం తప్ప, మిమ్మల్ని రచ్చ కీడ్చే అవకాశాలూ మార్గాలూ ఏవీ అతనికి వుండకూడదు! ఫోన్‌లో అతని కంఠం గమనించారా? ఎలావుంది?"

"శాంత కంఠం. ఆ కంఠంతో నాకు పరిచయం లేదు."

"ఈ మాధురి యెలాంటిది? ఇందులో ఆమె హస్త ముందంటారా?"

"లేదు, ఆమె చాలా నమ్మకస్తురాలు."

"ఫోటో లెలా అందాయి?"

"పోస్టులో."

"ఎక్కడున్నాయి?"

"చూసి వెంటనే కాల్చేశాను."

"ఐ సీ...." లాల్ కోపం అణచుకున్నాడు, "కవరు కూడా నా?"

"కవరుతో బాటు కాల్చేశాను."

"ఆ ఫోటోలెక్కడ తీయబడ్డాయో తెలుసా?"

"నా ఇంట్లో తీయబడ్డాయి."

"మీ ఇంట్లోనా! అయితే మీ భార్య—"

"అప్పుడామె వూరికెళ్ళింది, వారం క్రితం. అదే రోజు రాత్రి నేను మాధురిని పిల్చాను."

"ఆ ఫోటో లప్పుడే తీయబడ్డాయా?"

"అవును."

"ఎలా తెలుసు?"

"నేను మాధురిని ఇంటికి ఆ ఒక్కసారే పిల్చాను."

"అయితే అవి రాత్రిపూట తీయబడ్డాయన్న మాట."

"అవును."

లాల్ అన్నాడు, "రాత్రిపూట ఫోటోలు తీయాలంటే కొన్ని ఇబ్బందులుంటాయి. ఫ్లాష్‌గన్ లేకుండా తీయలేరు. కాబట్టి అప్పుడా మెరుపుకి పిట్టలు బెదిరిపోయి, రోజు బాగాలేకపోతే వాళ్ళచేతిలో చావుదెబ్బలు తింటాడు తీసేవాడు! మీకెన్ని ఫోటోలు అందాయి?"

"మూడు."

"ఎన్ని భంగిమల్లో?"

"మూడు భంగిమల్లో."

"నో, ఇంపాసిబుల్. మూడుసార్లు ఫ్లాష్‌గన్ వెల్గినా మీలో ఎవరూ గమనించనంతటి—" లాల్ ఆగిపోయి క్షణం తర్వాత నెమ్మదిగా అన్నాడు, "తమకమా? మైకమా?....అందులో వున్నారంటే అది సమంజసంగా లేదు."

"లాల్, మీకో విషయం చెప్పాలి" అన్నాడు రావ్ వెంటనే.

లాల్ నవ్వాడు. "చెప్పండి, రహస్యాలుండకూడదు. సిగ్గు విడిచిపెట్టాలి. అభిసారిక రాంషాగారు తెలుసా? ఆయన దగ్గర వందలాదిమంది సిగ్గుబిడియం వదలి ఏకరువు పెడతారు సమస్యలు."

"ఏమిటీ, మీతో దాంపత్య విషయాలు చర్చించడాని కొచ్చానా? పదేళ్ళనుంచీ చదువుతున్నాను అభిసారికను. కావాలంటే మీకు నేర్పగలను పాఠాలు!"

లాల్ తల గోక్కున్నాడు. "సారీ, ఏదో అనేశాను. మీరిక చెప్పండి."

రావ్ చల్లబడుతూ అన్నాడు: "ఆ రాత్రి మేమిద్దరం చెరో పెగ్గు జిన్ పుచ్చుకున్నాం. కాస్సేపటికే మాధురి కేదో మైకం కమ్మి సోలిపోయింది.... ఆ తర్వాత నాకూ అదే జరిగింది. అలా యెందుకు జరిగిందో నాకర్థంగాలేదు. నా లిమిట్ ఆరు పెగ్గులు. ఒక పెగ్గు లెక్కలోనిది కాదు! ఆ పెగ్గు ఎందుకంత తీవ్రంగా పనిచేసిందో తెలియలేదు. సుమారు రెండు గంటల తర్వాత కళ్ళు తెరిచాను. మాధురి ఇంకా అలాగే వుంది. అప్పుడు జరిగింది గ్రహించి ఆ జిన్ పాడయిందనుకొన్నాను. కాని క్రితం రోజువరకూ దాన్ని వాడాను—సగం బాటిల్ పూర్తయింది. ఇంతలోనే చెడిపోవడం అసంభవమన్పించింది. అదెలా చెడుతుందో, అప్పుడు దాని ప్రభావం ఏమిటో నాకు తెలియదు. డీలర్‌కు ఫిర్యాదు చెయ్యాలనుకున్నాను. కానీ ఉదయం లేచాక దాని విషయమే మర్చిపోయాను. వారం గడిచింది.... ఆ బాటిల్ అలాగే వుండిపోయింది."

"ఇప్పుడూ వుందా?"

"ఉంది, ఫ్రిజ్‌లో. మరో రెండు సీలు విప్పనివి కూడా వున్నాయి. వాటితో బాటు రెండు నిండు విస్కీ బాటిల్స్, ఒకటి సగం విస్కీ సీసా కూడా వున్నాయి— అరడజను బీరు బాటిల్స్‌తో బాటు యింకా ఫాంటా సోడా—"

"నెవర్ మైండ్, మీ ఇంట్లో యింకెవరు తాగుతారు?"

"నేనొక్కడ్నే. నా భార్య ముట్టుకోదు."

"మీరు పెగ్ అందిస్తున్నప్పుడు మాధురి అభ్యంతర పెట్టిందా?"

"లేదు, వెంటనే తాగేసింది."

"ఆమె బాటిల్ ముట్టుకుందా?"

"లేదు, వాటిని నేను ప్రాణంలా చూసుకొంటాను. ఎవర్నీ ముట్టుకోనివ్వను."

"అయితే వాటిమీద మీ వేలిముద్రలే వుండాలి" అన్నాడు లాల్ కాఫీ తాగుతూ, "కానీ ఈ జిన్ బాటిల్ మీద, సీలు విప్పిన విస్కీ బాటిల్ మీదా మరొకరి వేలి ముద్రలు కూడా వుండవచ్చు."

"ఎందుకుంటాయి?"

"ఎందుకంటే— బ్లాక్ మెయిలర్ వాటిలో ఏదో మత్తు మందు కలిపి మిమ్మల్ని సుషుప్తిలోకి పంపి ఫోటోలు తీశాడు గనుక! ఆ ఫోటోల్లో మీరిద్దరూ యాక్టివ్‌గా వుండివుండరు. నిస్త్రాణంగా-సోలిపోయి—ఒకరి బాహువుల్లో ఒకరు—"

"ఓహ్, మీకెలా తెలుసు? మీరా ఫోటోలు చూడలేదు!"

"నా మెదడులో క్లోజ్‌డ్ సర్క్యూట్ టి.వి. వుంది

లెండి" నవ్వాడు లాల్, "లేకపోతే మీ జిన్ ప్రభావానికి ఇంతకంటే ఎక్స్‌ప్లనేషన్ కన్పించడంలేదు. జిన్, విస్కీలలో కూడ—సీలు తెరిచినవి—అతడు మత్తుపదార్థం కలిపి, మీరు తాగి పడిపోయాక కావల్సిన భంగిమల్లో ఫోటోలు తీసుకున్నాడు. అందుకే మీరు ఫ్లాష్‌గన్ మెరుపు చూడలేకపోయారు.

"కాబట్టి ఫ్రిజ్‌లో బాటిల్స్ అన్నింటిమీదా వేలిముద్రలు తీయాలి. అతను ప్రొఫెషనల్ అయివుంటాడు. అమెచూర్ అయివుంటే మీ వంటి పెద్దచేపకు గాలం వేసే సాహసం చెయ్యడు. మీరా ఫోటోలు నాశనంచేసి పొరపాటు చేశారు. వాటిమీద విలువైన సాక్ష్యాధారం లభించవచ్చు—వేలిముద్రలు. మీరు త్వరపడ్డారు.

"వెల్, బాటిల్స్‌మీద పరాయి వేలిముద్రలుంటే వాటిని రికార్డ్సుతో వెరిఫై చేస్తే ఫలితం వుండొచ్చు. అప్పుడతన్ని పట్టుకోవడం సులభం అవుతుంది. మీ భార్య వూర్నించి తిరిగి వచ్చిందా?"

"మూడురోజుల క్రితమే వచ్చేసింది."

"అయితే ఒకపని చెయ్యండి. సాయంత్రం ఆరు గంటలకి ఆమెని తీసుకొని ఎక్కడికైనా వెళ్ళిపొండి. ఇంట్లో వుండకూడదు. సాయంత్రం జాన్ వెళ్ళి వేలిముద్రలు సేకరిస్తాడు. తొమ్మిదిగంటల వరకు సమయమిచ్చి తిరిగిరండి. ఈ లోపు జాన్ పని పూర్తి చేసుకుంటాడు. మీవి, మీ భార్యవి వేలిముద్రలు స్పెసిమెన్స్‌గా తీసుకోవాలి. అందుకు సాయంత్రం వెళ్ళేముందు వాటిని వదలండి...."

"ఎలా?"

"మీ మిసెస్‌ను గ్లాసులో మంచినీళ్ళు తెమ్మనండి. తెచ్చాక గ్లాసుమీద జాగ్రత్తగా మరోవైపు పట్టుకొని,

తాగి ఫ్రిజ్ మీద పెట్టేయండి."

"అలాగే" అన్నాడు రావ్. "కానీ లాల్, ఆ మర్నాటినుంచి ఆ విస్కీ తాగుతున్నాను. అందులో మార్పేమీ కన్పించలేదు. అందులో మందు కలిపి వుండదు."

"మీ కెలా తెలుసు? ఎందుకు కలపదు? ఆ రాత్రి మీరు జిన్ మాత్రమే తాగుతారని అతనికి తెలుసా?"

"మీరు నమ్మండి. ఆ విస్కీ స్వచ్ఛంగా వుంది."

లాల్ కాస్సేపు మౌనంగా వున్నాడు.

"అయితే ఇందులో మాధురి హస్తముండాలి.... మీ అభిరుచులు ఆమెకు తెలుసనుకొంటాను—తెలుసుకొని ఆ ప్రకారం నడచుకోడం ఆమె వృత్తికి ముఖ్యం.

"ఆ రాత్రి మీరు జిన్ తీసుకుంటారని పసిగట్టింది. అందులో పదార్థం కలిపి మీ కనుమానం రాకుండా మీతోబాటు తనూ తీసుకొంది. ఆ తర్వాత ఆమె బాయ్ ఫ్రెండ్ వూడిపడి పని పూర్తి చేసుకున్నాడు. ఇది నా వూహ. ఆమె అడ్రసు యివ్వండి, కనిపెట్టి చూద్దాం."

జగపతిరావ్ చిన్న కాయితంమీద అడ్రసు వ్రాసి, జేబులోంచి ఒక నోట్లకట్టతీసి దానితోబాటు అందిస్తూ, "మీరు నా సమస్యలు చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నారు మిస్టర్ లాల్. చాలా తృప్తిగా వుంది. మీ కెలా కృతజ్ఞతలు తెలుపాలో తెలియడంలేదు!" అన్నాడు.

లాల్ నవ్వాడు, "ఇంటి తాళాలెవరి దగ్గర వుంటాయి?"

"ఇద్దరివద్దా వుంటాయి."

"అయితే మీ తాళాలివ్వండి."

రావ్ ఇచ్చాడు.

"వెల్, మీరిక నిశ్చింతగా వుండండి" అన్నాడు లాల్.

"వాడు మళ్ళీ ఫోన్ చేస్తే ఏం చెప్పాలి?"

"అనవసరంగా వర్రీ కావద్దని చెప్పండి."

"అలాగే. రాత్రి ఇంటికొచ్చాక మీకు ఫోన్ చేస్తాను. ఎంతవరకొచ్చిందో చెప్పండి."

తలూపి లేచి బయటకి నడిచాడు లాల్.

2

రాత్రి 8 గంటలకి జాన్ బ్రీఫ్ కేసుతో ఆఫీసులోకి ప్రవేశించాడు.

"పార్ట్‌నర్ నువ్వెక రిటైర్‌మెంట్ పుచ్చుకోవాలి!"

"అలాగా.... ఎందుకు?"

"నీ అయిడియా ఫలించలేదు. బంగాళాదుంపలు ఉడకలేదు!"

"ఏమిటి? ఏం జరిగింది? ఏమటూ నవ్వు?"

జాన్ నవ్వాపుకుని అన్నాడు: "వేలిముద్రలవంటి సున్నిత విషయంలో నువ్వు అత్యాశకు పోవడం మంచిది కాదని ఉదయమే చెప్పాను. సమయం, శ్రమా వృధా చేశావు! అక్కడ మరో వేలిముద్రలు లేవు—రావ్‌వి తప్ప. గ్లాసుమీద అతనివి, అతని భార్యవి స్పెసిమెన్స్ సేకరించాను. ఫ్రిజ్‌లో బాటిల్స్ అన్నింటి మీదా రావ్‌వి తప్ప మరే వేలిముద్రలు లేవు!"

"రావ్ తాగిన జిన్ బాటిల్ మీద?"

జాన్ బ్రీఫ్ కేసులోంచి కొన్ని కవర్లు తీసి, వాటిలో ఒకదాన్ని లాల్‌కిచ్చాడు.

లాల్ దాన్ని తెరిచి ఏడు చతురస్రాకారంలో వున్న సెల్లోఫేన్ టేపు ముక్కల్ని తీశాడు. వాటిలో

పౌడర్‌లో వుత్పన్నమైన వేలిముద్రలు నిక్షిప్తయై వున్నాయి. భూతద్దం అందుకొని పరిశీలించసాగాడు. జాన్ మరొక కవర్లోంచి స్పెసిమెన్స్ తీసి అందించాడు.

ఆ తర్వాత అన్నాడు: "జిన్ బాటిల్ మీద, విస్కీ బాటిల్ మీద, మిగతా అన్ని బాటిల్స్ మీదా వేలిముద్రలన్ని రావ్‌తో సరిపోతున్నాయి. అతని భార్య వేలిముద్రలు ఆ గ్లాసుమీద తప్ప మరెక్కడా లేవు. ఇంకెవరి వేలిముద్రలు ఎక్కడా లేవు. క్షుణ్ణంగా గాలించాను. అన్ని బాటిల్స్ మీదా ఆటోమైజర్‌తో ఎంథ్రసిన్ పౌడర్ జల్లి—"

"ఎంథ్రసిన్ జల్లావా!"

"ఓహ్, సారీ. ఇంకా నిషా దిగలేదు.... యూనివర్సల్ గ్రేపౌడర్ జల్లి, కేమిల్ బ్రష్‌తో పల్చగా అద్ది, ఉత్పన్నమైన వేలిముద్రలమీద ఈ టేప్స్ అంటించి లాగాను. పర్‌ఫెక్ట్ జాబ్. ఎక్కడా చెడిపోలేదు. పాయింట్స్, రేఖలు స్పష్టంగా వచ్చాయి.

లాల్ పదినిమిషాలసేపు మిగతా కవర్స్‌లోని వేలిముద్రల్ని కూడా పరిశీలించి నిట్టూర్చాడు.

"గ్లోవ్స్ ఉపయోగించి వుండాలి. ఏమంటావు?"

జాన్ తలూపాడు. "మరో విషయం. నువ్వు చెప్పినట్లు జిన్‌లో కల్తీ ఏమీ లేదు. నేను రుచి చూశాను. పూర్తి జిన్ తాగేశాను. అది చూపవల్సిన ప్రభావంకంటే శక్తివంతంగా ఏమీ లేదు. విస్కీ కూడా తాగాను. అది కూడా అసహజంగా ఏమీ లేదు. మిగిలిన బాటిల్స్ ఏవీ సీల్సు విప్పలేవు.

"ఒకవేళ నీ అనుమానం నిజమై—జిన్‌లో మత్తుమందు కల్సివుంటే నేటికి అది శక్తిని కోల్పోయి

వుండవచ్చు. అది ఆ పదార్థ తత్వంమీద ఆధారపడి ఉంటుంది.

"ఇదీ ఒప్పుకోకపోతే అసలు బాటిల్‌లో కలిపి ఉండకపోవచ్చు. గ్లాసులో పోశాక మాధురి రహస్యంగా రావ్ జిన్‌లో కలిపివుండవచ్చు. ఆమె మామూలు జిన్ తాగి నటించి ఉండవచ్చు. అప్పుడు రావ్ సుషుప్తిలోకి జారుకున్నాక బాయ్ ఫ్రెండ్‌తో మిగతా తతంగం జరిపి ఉండవచ్చు. ఏమంటావు?"

"ఇప్పుడు మార్గం ఏమిటంటాను!" అన్నాడు లాల్ నిస్పృహగా. "ఆ వేలిముద్రలమీద నేను చాలా ఆశ పెట్టుకున్నాను. ఫలించలేదు. ఈ మాధురి కూడా ఎలాంటి ఆధారాలు ఇవ్వలేదు. ఉదయంనుంచీ ఇంట్లోనే వుంది. ఆమెనెవరూ కలుసుకోలేదు."

"ఆమెని రాత్రులే కలుసుకుంటారు" అన్నాడు జాన్. "పగలు విశ్రాంతి తీసుకుంటుంది....ఆమె ఈ బ్లాక్ మెయిల్ వ్యవహారం నడుపుతూ విశ్రాంతిగా వుంటుందా? బిజీగా ఉంటుంది-ఫ్రెండ్స్‌తో సమావేశాలు జరుపుతూ, సూచనలిస్తూ. ఆమె ఫ్రెండ్ తప్పక కలుసుకొని ఉండాలి....కాని అతని జాడలేదు. ఉదయంనుంచీ ఆమె ఇంట్లో వంటరిగానేవుంది."

"రాత్రి కలుసుకుంటారేమో — రహస్యంగా ఉంటుంది."

"అవును. పదిగంటలకి సీరాక్‌లో ఆమె ప్రోగ్రాం వుంది. అదయ్యాక కనిపెట్టాలి. వస్తావా?"

సరిగ్గా తొమ్మిదిన్నరకి ఫోన్ మ్రోగింది. లాల్ రిసీవర్ ఎత్తి పలికాడు.

"హలో, లాల్! ఏం తెలుసుకొన్నారు?" రావ్

అన్నాడు.

లాల్ సందేహించాడు. "ఏమీ లేదు, అక్కడ వేలి ముద్రలు లేవు."

"ఓహ్, అయితే ఎలా? ఏం చేస్తారు?"

"మాధురిని కనిపెడుతున్నాం. ఏ క్షణంలోనైనా వాళ్ళిద్దరు బయటపడవచ్చు. సహనం వహించాలి, అంతే. అది ఈ రాత్రికే జరుగుతుంది. ఆమె ఫ్రెండ్ తప్పకుండా ఎక్కడో కలుసుకుంటాడు. అప్పుడతన్ని ట్రాప్ చేస్తాం."

"ఎలా? ఏ మార్గమాలోచించారు?"

"ఇప్పుడే చెప్పలేను. మీరు నిశ్చింతగా వుండండి. రేపు రాత్రిలోగా ఎలాగైనా అతన్ని పట్టుకుంటాం!"

"మిమ్మల్ని నమ్ముతాను, లాల్. నేనిక నిశ్చింతగా వుంటాను. మీరు ఉదయం ఫోన్ చేసి ఏ విషయం— హలో—ఓహ్ గాడ్! ఏమిటిది?"

లాల్ కళ్ళు చిట్లించాడు. "ఏమిటి మీరనేది?"

"ఇక్కడ—ఈ ఫోన్ మీద—ఏమిటిది?"

"ఏమిటిది?" లాల్ అసహనంగా అన్నాడు. అవతల క్లిక్‌మన్న శబ్దం వినిపించింది.

లైను కట్—అయింది అకస్మాత్తుగా.

లాల్ అలాగే ఉండిపోయాడు కొన్ని క్షణాలు. ఆ తర్వాత ఉలికిపడి మళ్ళీ డయల్ చేశాడు. కానీ రెస్పాన్స్ లేదు.

"ఏమిటీ గొడవ!" అన్నాడు జాన్.

"రావ్ మధ్యలో ఫోన్ పెట్టేశాడు—ఏమీ చెప్పకుండా."

"ఏం చెప్పకుండా?"

"ఫోన్ మీద ఏదో వుందన్నాడు—"

"ఏం వుంది?"

"అదే చెప్పలేదు! ఠక్కున పెట్టేశాడు. ఫోన్ మీద-మౌత్ పీస్ మీద ఏమంటుంది, జాన్?"

"బ్లాక్ మెయిలర్ టాప్ చేశాడా? రావ్ దానిమీద బగ్ చూశాడా?"

"బగ్స్ పైకి కన్పించేలా అమర్చరు!"

"అయితే ఏమిటది! బల్లని చూశాడా? లేక బాద్దింకను—"

"దేని తాలూకో చిహ్నం చూశాడు. ఏమిటది? నువ్వక్కడేం చేశావ్? ఫోన్ని ముట్టుకొన్నావా విస్కీ చేతులతో? లేక వేలిముద్రలు తీస్తున్నప్పుడు పౌడర్—"

"లేదు, నేను ఫోన్ని అసలు ముట్టుకోలేదు."

"ఓహ్, మళ్ళీ డయల్ చేస్తే అతనెందుకు రెస్పాన్స్ ఇవ్వలేదు? ఏం చేస్తున్నాడు?"

"లెటజ్ రన్! వెళ్ళిచూద్దాం."

లాల్ ఉలిక్కిపడ్డాడు, "జాన్!"

"యస్?"

"మా సంభాషణ ఎవరో రహస్యంగా విన్నారు!"

"ఎవరు? ఎలా?"

"రావ్ తో మాట్లాడుతున్నప్పుడు మధ్యలో క్లిక్ మని శబ్దమైంది. అతనింట్లో ఎక్స్టెన్షన్ ఉండాలి. మా మాటలు వింటున్నదెవరో మధ్యలో కంగారుగా డిస్కనెక్టు చేశారు!"

"ఎవరు? అతనింట్లో ఇంకెవరున్నారు, భార్య తప్ప!"

"అవును.... భార్య!" లాల్ ముఖం ప్రసన్నమైంది. "ఈ భార్య ఇందులో ఎక్కడ ఇముడుతుంది, జాన్? ఆమె ఎలా వుంటుంది? ఆమెనోసారి చూడాలి. మా

మాటలు వినివుంటే ఫోన్ మీద వున్నదేమిటో తెలుసుకుంటుంది...."

జాన్ గబుక్కున రిసీవర్ ఎత్తి డయల్ చేశాడు.

వెంటనే రెస్పాన్స్ వచ్చింది.

"హలో, మిస్టర్ రావ్!"

"ఎవరూ?"

జాన్ ఉలికిపడి నిటారుగా కూర్చున్నాడు.

"రావుగారున్నారా?"

"లేరు, నేను మిసెస్ రావ్ ని?"

"ఆయనెక్కడున్నారు?"

"ఇప్పుడే హడావిడిగా వెళ్ళిపోయారు. ఎక్కడికో చెప్పలేదు. మీరెవరు?"

"సారీ, ఆయనతోనే మాట్లాడాలి" జాన్ డిస్కనెక్టుచేసి మరో నెంబర్ తిప్పాడు. కాసేపు విని పెదవులు చప్పరించాడు.

ఫోను పెట్టేస్తూ "మాధురి కూడా ఇంట్లో లేదు" అన్నాడు, "క్లబ్ కి వెళ్ళివుండాలి. రావ్ ఎక్కడికో చెప్పకుండా వెళ్ళాడని భార్య అంది. బహుశ క్లబ్ లో మాధురిని కలుసుకోవచ్చు."

"నువ్వెక్కడికెళ్ళు. నేను రావ్ ఇంటికెళ్తాను" అన్నాడు లాల్ లేస్తూ. "అతని భార్య గొంతు ఎలా వుంది?"

"ఆడవాళ్ళ గొంతులా వుంది?"

"డామ్యూ!" లాల్ కోపం అణచుకొన్నాడు, "పెద్దమనిషి కంఠమా? వయసులో వున్న కంఠమా?"

"సారీ, బాస్ గమనించలేదు.నీ కెవరికంఠంకావాలి?"

"నీ కంఠం కావాలి! పిసుకుతాను!"

3

ఆమెను చూసి ఆశ్చర్యమేసింది లాల్ కి.

ఆమె వయసు ముఫ్ఫై లోపు ఉంటుంది. ఎంతో ఆకర్షణీయంగా వుంది. ప్రపంచంలో అందమైనవాళ్ళు చాలామంది ఉంటారని లాల్ కు తెలుసు. అతన్ని ఆశ్చర్యపర్చింది యాభై పైబడ్డ జగపతిరావ్ కి ఆమె భార్య కావడం.

తేరుకొని న వ్వాడు, "మీరు మిసెస్ రావ్, అవునా?"

ఆమె తీక్షణంగా చూసింది.

"అవును. ఆయన లేరని చెప్పాను ఫోన్ లో."

"లేరని చెప్పలేదు, వెళ్ళిపోయారని చెప్పారు."

ఆమె మరింత తీక్షణంగా చూసింది.

"ఆయనతో ఏం పని?"

"చాలా ముఖ్యమైన పని.ఆయనతో నే మాట్లాడాలి."

"అయితే ఆయన వెళ్ళిపోయారని—లేరని తెలిసి ఎందుకొచ్చారు?"

"ఎక్కడికెళ్ళారో తెలుసుకుందామని."

"ఎక్కడికెళ్తున్నారో నాతో చెప్పలేదన్నాను, ఫోన్ లో."

"ఇప్పుడాలోచించుకొని చెప్పండి, నాతో. ఎక్కడికెళ్ళి వుంటారు?"

"ఆయనతో పనేమిటో చెప్పండి, వూహిస్తాను."

"నేను బొంబాయినుంచి వచ్చాను—స్టాక్ ఎక్స్చేంజ్ ఏజెంట్ ని—ఆ విషయాలు మీ కర్థంకావు. ఆయన్ని అత్యవసరంగా కలుసుకోకపోతే అయిదు లక్షలు నష్టమని మాత్రం చెప్పగలను."

నవ్వింది ఆమె. "మీరు నటించలేరు—మారువేషంలో తప్ప. మీ పాప్యులారిటీ బాగా పెరిగిపోయింది. జనం మిమ్మల్ని ఇట్టే గుర్తుపడ్తారు. లోనికి రండి, డిటెక్టివ్ లాల్. జాన్ ఏడి? మీరంటే నాకెంతో ఇష్టం."

"థాంక్యూ వెరీమచ్," లాల్ నవ్వుతూ లోనికి వెళ్ళాడు. "మీరు పేరు చెప్పనేలేదు. ఇష్టంలేదా? మిమ్మల్ని మిసెస్ రావ్ అనే—"

మళ్ళీ నవ్వింది ఆమె. "నా పేరు మాధవీలత — మాధవి అని పిలవండి."

"వెరీ వెల్!" లాల్ చుట్టూ చూశాడు. ఎక్కడా ఫోన్ లేదు.

"కూర్చోండి, లాల్. మిమ్మల్ని చూస్తే డిటెక్టివ్‌లా వుండరు. చాలా సింపుల్‌గా, ఆర్భాటం లేకుండా వుంటారు."

"నేను డిటెక్టివ్‌నని తెలియడానికి మెళ్ళో భూతద్దం చేతిలో పిస్తోలు పట్టుకోవాలా!" నవ్వాడు లాల్, "మీరు తెలుగు సినిమాలు బాగా చూస్తారనుకొంటాను. సినిమా, డిటెక్టివ్‌లు బఫూన్స్. మమ్మల్ని వాళ్ళలా ఊహించుకోకండి దయచేసి!"

నవ్వేసిందామె, ఈసారి పైకి గట్టిగా.

"ఓ.కే. మాడమ్. ఇక విషయానికొద్దాం. ఆయన ఎందుకలా వెళ్ళిపోయారు?"

ఆమె నవ్వు మాయమై మళ్ళీ తీక్షణంగా చూసింది.

"నాకు తెలియదు. ఈ గొడవేమిటో అసలు అంతు చిక్కడం లేదు!"

"ఆయన ఫోన్ మీద చూసిందేమిటి?"

ఆమె కళ్ళు విశాలం చేసింది. "ఫోన్ మీద ఏం

చూశారు? అది మీ కెలా తెలుసు?"

"మీకులాగే నాకూ తెలుసు. ఆయన చెప్పగా నేను ఫోన్‌లో విన్నాను, మీరు ఎక్స్‌టెన్షన్‌లో విన్నారు. అంతే తేడా!"

"నేను ఎక్స్‌టెన్షన్‌లో విన్నానా?"

"ఈ ఇంట్లో ఇంకెవరూ లేరనుకుంటాను."

"మీరేమంటున్నారో అర్థంగావటంలేదు!"

"మీ భాషలోనే అంటున్నాను కదా?"

"నాకేమీ తెలియదు! మీరు పొరబడుతున్నారు."

"మీరు బుకాయిస్తున్నారు. మీరు ఎక్స్‌టెన్షన్‌లో మా మాటలు విన్నారని నాకు నమ్మకంగా తెలుసు."

"ఎలా తెలుసు? ఎలా ఆరోపిస్తున్నారు? అలా ఒకరి మాటలు వినే అలవాటూ, ఒకరి ఉత్తరాలు చదివే దుర్బుద్ధీ నాకెన్నడూలేవు!"

లాల్ అసహనంగా చూశాడు. "అయితే ఇక్కడింకెవరున్నారు వింటానికి? దెయ్యంగాని విన్నదా?"

"నా ఇంట్లో దెయ్యాలున్నాయంటే వూరుకోను. మీ రాలోచించి మాట్లాడండి. సాయంత్రం మేం బయటికెళ్ళాక ఇంట్లోకెవరో వచ్చాడు—"

"ఎవరు?"

"ఎవరో తిండిదొంగ! కిచన్‌లో స్టవ్ వేడిగా వుంది. గిన్నెలో పాలులేవు! కాఫీపొడి, చక్కెర డబ్బాలు స్థానాలు మారాయి. అంతేగాక ఒక ఆమ్లెట్ కూడా మాయమైంది...."

లాల్ ముఖం ఎర్రబడింది. "ఎవరొచ్చి ఉంటాడు?" అన్నాడు బలహీనంగా.

"నాకెలా తెలుసు? మీరు డిటెక్టివ్‌లు, తెలుసు

కోండి. ఈ పొడుగోల నాకంటే మీకే బాగా తెలుసు."

"సరే ఫోన్ ఎక్కడ? దానిమీద ఏం వుందో నేనే చూస్తాను."

"మీరు చూడకూడదు."

"ఎందుకు చూడకూడదు?"

"ఫోన్ బెడ్‌రూంలో వుంది."

"ఉంటే?"

"ఉంటే ఏమిటి! నా ఇంట్లో నాకు ప్రైవసీ ఉండదా? దాన్ని భంగపర్చడానికి మీరెవరు? మిస్టర్ లాల్, మీరొక విషయం బాగా గుర్తుంచుకోండి. మీరు రాత్రిపూట ఒంటరిగా వున్న ఆడదాని ఇంట్లో జొరబడి అఘాయిత్యం జరుపుతున్నారు. చాలా తీవ్రమైన పరిణామాల్నెదుర్కొంటారు!"

"బెదిరిస్తున్నారా? ఆల్ రైట్, అయితే వినండి. మీ వారు బ్లాక్ మెయిల్లో ఇరుక్కున్నారు. ఆయన ప్రతిష్ఠకు ప్రమాదం వుంది. మేం బ్లాక్ మెయిలర్‌ని ట్రేస్ చెయ్యడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. మీవారికెలాంటి ఆపద రాకుండా చూస్తున్నాం. ఇప్పుడు మీరు పట్టుదల మాని సహకరిస్తారా?"

"సహకరించను. కట్టుకథలు చెప్పకండి! దయచేసి ఆయన వచ్చాక రండి!"

"ఆయనెలా వెళ్ళారు?"

"కార్లో వెళ్ళారు."

"మీరెప్పుడొచ్చారు?"

"తొమ్మిదిన్నర కావస్తోంది."

"భోజనం చేశారా?"

"లేదు. నేను కిచెన్‌లో సర్దుతున్నాను. ఇంతలో ఆయన క్రిందికి దిగివచ్చి హడావిడిగా వెళ్ళిపోయారు."

"ఏమీ చెప్పకుండానే?"

"అవును. అంతకుముందు ఫోన్‌లో మాట్లాడు తున్నారు."

"ఎక్స్‌టెన్షన్ ఎక్కడవుంది?"

"ఆ ప్రక్కగదిలో!" అర్చిందామె కోపంగా.

"ఆయన బట్టలు మార్చుకున్నారా?"

"లేదు, అలాగే వెళ్ళిపోయారు."

"అప్పుడు మీ రేం చేశారు?"

"భోజనం చేశాను."

"బట్టలు మార్చుకోకుండానే?"

"అవును."

"మీ ఆచారం వింతగా వుంది. ఆయన వెళ్తున్నప్పుడు లేక వెళ్ళిపోయాక మళ్ళీ ఫోన్ మోగింది కదూ?"

"అవును, అప్పుడు నేనే ఎత్తాను."

"అప్పుడు ఎత్తలేదు. ఆయన డిస్‌కనెక్టు చేసిన వెంటనే నేను డయల్ చేశాను. అప్పుడు రెస్పాన్స్ లేదు. తర్వాత జాన్ చేసినప్పుడు మీరు పలికారు."

"అయితే మొదటిసారి వినివుండను."

"వినే వుండాలి....ఇది రాత్రి సమయం. శబ్దాలు దూరంగా వ్యాపిస్తాయి. మీ ఇంట్లో మనుషులెవరూ లేరు సందడికి."

"నాకేమీ వినిపించలేదప్పుడు."

"కానీ మిమ్మల్ని చూస్తే భోజనం చేసినట్టులేదు,"

"ఎలా అంటున్నారు? ఏమిటి ఉద్దేశం?"

"మీరు బయటనుంచి వచ్చి ఇంకా ముఖం కడుక్కో-

లేదు. మీ బట్టలు బాగా నలిగాయి. తల చెదిరింది. ముఖంమీద చెమట ఉడ్డు .... వెల్, వెల్, మీరు చేతులెందుకు దాస్తున్నారు? అవెందు కలా వణుకు తున్నాయి?"

"మిస్టర్ లాల్! వెళ్ళిపొండి! మీ పిచ్చిమాటలతో నన్ను హేళనచేస్తున్నారు!"

"అయాం సారీ, నేనిప్పుడు వెళ్ళదలచలేదు."

"అంటే?"

"ఆయన వచ్చేవరకూ ఇక్కడే ఉంటాను" అన్నాడు లాల్ చుట్టూ చూస్తూ. "మీ ఇల్లు బాగుంది. బాగా అలంకరించారు. మీ అభిరుచికి జోహార్లు. ఆ పెయింటింగ్ మరీ బాగుంది. మీకు ఇందిరాగాంధీ అంటే ఇష్టమా?"

"మావారి కిష్టం."

"చాలా బాగుంది. భర్తల ఇష్టాల్ని తెలుసుకొని నడుచుకొనే భార్యలంటే నాకు చాలా గౌరవం."

ఒక్కసారిగా ఫోన్ మ్రోగింది.

ఆమె కంగారుగా చూసింది. లాల్ నవ్వాడు.

"మీవారు కావచ్చు—"

"మీరిక్కడే వుండండి. నేను చూసివస్తాను!" ఆమె గిరుక్కున తిరిగి, మెట్లెక్కి పైకురికింది.

లాల్ వేగంగా ప్రక్కగదిలో దూరి ఎక్స్‌టెన్షన్ ఎత్తాడు.

అవతలి కంఠం అంటోంది, "హలో ఎవరవతల?"

అది జాన్ గొంతు.

మాధవి అంది, "మీ రెవరసలు?"

"నేను— నేను— అయితే మీరు మిసెస్ రావ్ కదూ?"

"ఓహ్, మళ్ళీ మీరా! నటించకండి, మీరెవరో నాకిప్పుడు తెలుసు! డర్టీ డిటెక్టివ్ జాన్! ఎందుకు ఫోన్ చేశారు?"

"గాడ్... లాల్ అక్కడున్నాడా?"

"ఈ ఇల్లు మీ స్థావర మనుకున్నారా? పెట్టేయండి ఫోను!"

"మాడమ్—"

రిక్కున లైను కట్ అయింది.

లాల్ వెంటనే రిసీవర్ పెట్టేసి బయటికొచ్చాడు.

"ప్లీజ్ గెటవుట్, లాల్! ఈ పాడుగోల నేనింక భరించలేను!" అర్చింది మాధవి, మెట్లు దిగివస్తూ.

"ఫోన్ చేసిందెవరు?"

"మీ పార్ట్‌నర్."

"ఏమన్నాడు?"

"త్వరగా రమ్మన్నాడు. ప్లీజ్ వెళ్ళిపోండి."

"ఆల్ రైట్, ఆ ఫోన్ మీద ఏం వుందో ఇప్పుడైనా చూపిస్తారా?"

"అబ్బబ్బబ్బ! ఏం వుంటుంది? ఎవరన్నారు? మీకు పిచ్చెక్కింది."

"పిచ్చెక్కింది.... అవును, పిచ్చెక్కింది" అన్నాడు లాల్ సాలోచనగా. "అయితే ఆ గదిలో నాకు ఎంట్రీ—ప్రవేశం లేదన్నమాట?"

"లేదు. లేదుగాక లేదు. వందసార్లు లేదు!"

"అయితే మొదటిసారే వెళ్ళిపోతాను!" అన్నాడు లాల్ వెంటనే "ఆయనొచ్చాక ఫోన్ చేయమని చెప్పారా?"

"చెప్తాను," అందామె చల్లబడుతూ.

ఆమెనోసారి పరీక్షగా చూసి బయటికి నడిచాడు లాల్.

4

సమయం 11 కావస్తోంది. బయట చీకటిగా వుంది. లాల్ కారు వేగంగా డ్రైవ్ చేసి వీధి మలుపులో ఆపే శాడు. వెంటనే దిగి చుట్టూ చూశాడు. జనసంచారం లేదు. గబగబా రావ్ ఇంటికేసి నడిచాడు. నడక మూడు నిమిషాలు పట్టింది. రావ్ ఇంట్లో ఇంకా లైట్లు వెలుగు తున్నాయి. ముందు తలుపు మూసివుంది.

లాల్ ప్రహరీ గోడ దూకి, మొక్కల్ని చాటు చేసు కుంటూ ఇంటి వెనక్కి ఉరికాడు. మేడమీదకి మెట్లు ఇంట్లోంచి వున్నాయి.... ఇంటి వెనుక ఎడమవేపు పైనుంచి డ్రైనేజి పైపులున్నాయి. వాటిని పట్టుకొని ఎగబ్రాక సాగాడు. రెండు నిమిషాల్లో పైకి చేరుకొని బాల్కానీలో ప్రవేశించాడు. అలికిడి కాకుండా, నెమ్మదిగా వెలుతురు వస్తోన్న గది కిటికీ దగ్గర వెళ్ళి ఆగాడు.

గదిలో ఎవరూ లేరు.

గ్రాంఫోన్‌లో పాప్ మ్యూజిక్ తక్కువ స్థాయిలో విన్పిస్తోంది. గదిలో ఫోంబెడ్, రెండు పేము కుర్చీలు, టీపాయ్, ఒక టేబిల్ మొదలైనవి ఉన్నాయి.

టీపాయ్‌మీద ఒక సిగరెట్ ప్యాకెట్, లైటర్, ఆష్‌ట్రే వున్నాయి. ఆష్‌ట్రే అంచున ఒక సిగరెట్ సగంవరకు కాలి ఆరిపోయి వుంది. లోపల చాలా పీకలు కుక్కి వున్నాయి.

టీపాయ్ చివర ఒక గ్లాసు, విస్కీ, సోడా సీసా వున్నాయి.

ఇంతలో మాధవి ప్రవేశించింది గదిలో.

ఆమె వస్తూనే వింత భంగిమలో వచ్చింది— మ్యూజిక్‌కి అనుగుణంగా శరీరాన్ని కదిలిస్తూ.

లాల్ ఒక్క క్షణం ప్రక్కకు తొలగి మళ్ళీ చూశాడు. ఇప్పుడు గ్రాంఫోన్ హెచ్చు స్థాయిలో వినిపిస్తోంది.

ఒక్క గుక్కలో గ్లాసు ఖాళీచేసి లేచింది. సిగరెట్ ఒక దమ్ము గట్టిగా లాగి ఆష్‌ట్రేలో కుక్కింది. తిరిగి నృత్యం ప్రారంభించింది.

లాల్ దృష్టి ఆమెమీదనుంచి టేబిల్ మీదనున్న టెలిఫోన్ పైన పడింది. దాన్ని తదేకంగా చూశాడు. ప్రత్యేకంగా ఏమీ కన్పించక పోవడంతో, కొన్ని క్షణాలు ఆమె నృత్యం ఉత్సాహంగా చూసి వెనుదిరిగాడు.

కారెక్కి వేగంగా మెయిన్ రోడ్ చేరుకొన్నాడు. బిజీగా వున్న ఒక రెస్టారెంట్‌లో కెళ్ళి, సీరాక్ హోటల్‌కు ఫోన్ చేశాడు. రిసెప్షనిస్టుతో ఆ కాల్ అక్కడే వున్న డిటెక్టివ్ జాన్ కివ్వమన్నాడు.

"హలో, జాన్. లాల్ హియర్" అన్నాడు జాన్ గొంతు విని.

"లాల్! నువ్వెక్కడున్నావ్!"

"ఇప్పుడే రావ్ ఇంటినుంచి వస్తున్నాను."

"కానీ నువ్వక్కడ లేవని ఆమె చెప్పింది—"

"ఆమె అలాగే చెప్తుంది. నువ్వెందుకు ఫోన్ చేశావ్?"

"రావ్ గురించి....అతనిక్కడికి రాలేదు."

"మాధురి?"

"వచ్చింది....ఇప్పుడే ఆమె ప్రోగ్రాం ముగిసింది—బోనీ—యమ్: రాస్పుటిన్ నెంబర్ అద్భుతంగా అభినయించింది—వారెవా!"

"వెల్, నువ్వక్కడ పబ్లిక్ డాన్సు చూశావు, నేనిక్కడ ఫ్యామిలీ డాన్స్ చూశాను."

"అంటే....?"

లాల్, మాధవి గురించి అంతా చెప్పాడు.

"అరె బ్రదర్, నీకేం తెలుసు! ఆ అదృష్టం నాకు గనుక లభిస్తేనా!"

"మాధురి ఎక్కడుంది?"

"ప్రస్తుతం గ్రీన్ రూంలో."

"ఏం చేస్తోంది?"

"అవతారం మార్చుకుంటోంది."

"ఆమెతో ఎవరున్నారు?"

"ఎవరూ లేరు....లాల్, మనం అనుకొనే బ్లాక్ మెయిలర్ ఇక్కడ ప్రత్యక్షంగా లేడు. మాధురి ఈ రాత్రి ఇక్కడే వుంటుందో. ఇంటికెళ్తుందో తెలియదు. నేనామెతో గడపాలనుకొంటున్నాను—ఓహ్, నా ఉద్దేశం అది కాదు, బాస్—అందుకామె ఒప్పుకొంటే ఆమె ఫ్రెండ్ ఈ రాత్రి కలవడని స్పష్టమవుతుంది. ఒప్పుకోకపోతే కలుసుకొనే అవకాశం ఉండవచ్చు. అలా ఏ విషయం తెలిస్తే వాళ్ళని కనిపెట్టి ఇద్దర్నీ ట్రాప్ చెయ్యవచ్చు. ఏమంటావు?"

"నీకీ ఆలోచన ఎలా వచ్చిందో తెలియడంలేదు. ఆమెను చూస్తే వాడిపోయిన పువ్వులా—"

"డామ్ హర్ గ్లామర్! ఎవడిక్కావాలి? పిచ్చాపాటి మాటలతో కాలక్షేపానికి గ్లామర్ కావాలా? లాల్, నన్నిలా చపలుడిగా ట్రీట్ చెయ్యకు. నీరసం వస్తోంది!"

"జాన్, నిన్ను వేలిముద్రల కోసం వంటగదిలో కెవరు వెళ్ళమన్నారు?"

"వంటగది ...? ఏ వంటగది? ఎవరన్నారు?"

"మాధవీ లత అంది. నువ్వక్కడ ఓ ఆమ్లెట్ కాజేసి కాఫీ చేసుకు తాగావు."

"ఓహ్, డామ్ హార్ ....! మరేం చెయ్యమంటావు? డిటెక్షన్‌లో తాగేసిన విస్కీ, జిన్ కలిసి నోళ్ళు తెలియకుండా చేశాయి. ఆమ్లెట్ తినేసి, మూడు కప్పుల కాఫీ తాగాను. ఆ పని చెయ్యకపోతే నా గతేంకాను! అక్కడే పడిపోయి—వాళ్ళొచ్చాక ఆమె చేత తిట్లూ, దెబ్బలు తినమంటావా?"

"వద్దు—ఆమ్లెట్ తిని మంచి పని చేశావు. ఇప్పుడు రావ్ సంగతేమిటి?"

"అన్నీ నా నెత్తిన వెయ్యకు! నువ్వేం చేస్తావ్? ఇంటికెళ్ళి పడుకుంటావా? మర్యాదగా రావ్ ఇంటిదగ్గర నిఘా వేస్తేనే సరేసరి! లేదా మళ్ళీ నీకు కన్పించను. దోస్త్ దోస్త్ నారహా....అని పాడుకొంటూ వెళ్ళిపోతాను. అర్థమైందా?"

"శాంతించు! రావ్ నేరుగా బ్లాక్ మెయిలర్ దగ్గరికెళ్ళాడని నా అనుమానం, జాన్. ఫోన్ మీద అతనికేదో క్లూ దొరికింది. దాంతో బ్లాక్ మెయిలర్ ఎవరో తెలిసిపోయి వుండవచ్చు. అది మనకు తెలియనివ్వకుండా వెళ్ళిపోయాడు."

"అయితే మర్డర్ కవకాశముంది, లాల్. నివారించే మార్గం ఆలోచించాలి! ఆ క్లూ ఏమిటో తెలిసి చావటం లేదు! కొన్ని క్లూస్ ఎదురువచ్చి పలకరిస్తాయి, క్లూ ఇచ్చిన కాకిపిల్లలా. కొన్ని క్లూస్ దాగుడుమూతలాడుతూ సతాయిస్తాయి ఇలా!

"లాల్, మాధవి అబద్ధం చెప్తోంది. ఎక్స్‌టెన్షన్‌లో

ఆమె తప్ప ఎవరూ వినలేదు. కానీ ఏదో మోటివ్‌తో ఆ విషయం దాస్తోంది. ఫోన్ మీద రావ్ చూసిందేమిటో ఆమెకు తెలిసి ఉండవచ్చు—లేదా—ఉండకపోవచ్చు—రావ్ దాన్ని తొలగిస్తే.

"అయితే ఆమె ప్రవర్తన నాకాశ్చర్యంగా వుంది. ఆమె మద్యం ముట్టుకోదని రావ్ అన్నాడు. అలాగే ఫ్రీజ్‌లో ఆమె వేలిముద్రలు లేవు. కానీ ఇప్పుడామె విస్కీతో బాటు సిగరెట్లు కాల్చడం నమ్మలేకపోతున్నాను. నిజమేనా, లేక అలా నీవు కలగన్నావా? సిసలైన బ్రహ్మచారివి!"

"షటప్, నిజమే! నాకలాంటి కలలు రావు."

"ఓ.కే! సిగరెట్లు ఏ బ్రాండ్‌వి?"

"రావ్ బ్రాండ్ కాదు."

"వెల్, ఆమె ధైర్యాన్ని మెచ్చుకోవాలి లాల్! లేక ఆమె ప్రవర్తనను అనుమానించాలా? భర్త ఆమెతో ఎక్కడికెళ్తున్నాడో, ఎప్పుడొస్తాడో చెప్పకుండా వెళ్లిపోతే; ఆమె ఏ ధైర్యంతో తాగుతూ ఆడుతూ ఎంజాయ్ చేస్తోంది? హఠాత్తుగా అతను వచ్చేస్తే? అంత త్వరగా రాడని ఆమెకు తెలుసా? ఎలా తెలుసు? అయితే ఎక్కడికెళ్ళాడో కూడా తెలిసి వుండాలి—"

"జాన్, నువ్వెక్కువ మాట్లాడేస్తున్నావు. అక్కడెవరూ లేరా?"

"మూసే వేళయింది, ఎవరూ లేరు. రిసెప్షనిస్టు దూరంగా వ్రాసుకొంటున్నాడు. ఓ.కే. నేను మాధురిని కనిపెడ్తాను. నువ్వు రావ్ ఇంటిదగ్గరే వుండు, అతనొచ్చే వరకూ. మళ్ళీ మనం కలుసుకునేది ఇంట్లోనే. అదుగో.... ఆమె వస్తోంది! వెంట ఎవరో వున్నాడు—"

"ఎవరు? ఎలా వున్నాడు?"

"సింథీలావున్నాడు. బొంబే డైయింగ్ మోడల్‌లా ఆరోగ్యంగా వున్నాడు. ఇద్దరూ మాట్లాడుకోడంలేదు. బయట టాక్సీ ఎక్కుతున్నారు....డోర్ గ్లాస్‌లోంచి కన్పిస్తోంది. ఆల్ రైట్ లాల్, నేనిక వెళ్లాలి గుడ్ నైట్!"

"గుడ్ నైట్, జాన్."

5

సమయం 12 కావస్తోంది. లాల్ తిరిగి కారెక్కి రావ్ ఇంటికి పోనిచ్చాడు. ఈసారి ఇంటి వెనుక వీధిలోకి డ్రైవ్ చేస్తూ ఆలోచించసాగాడు. కారు సరిగ్గా రావ్ ఇంటి వెనుక ప్రాంతాల చేరుకొంటుందనగా, హెడ్ లైట్స్ వెలుగులో రోడ్డుమీద పొడుగ్గా ఏదో మరక కన్పించింది.

లాల్ కారాపేసి హెడ్‌లైట్స్ ఆర్పేశాడు. డాష్ బోర్డునుంచి డ్యూయలక్స్ మినీ టార్చి అందుకొని దిగాడు. ఓసారి వీధి రెండువైపులా చూసి, ఆ మరక దగ్గరికెళ్ళి టార్చివేశాడు.

అది పేడ మరక. ఇంకా పచ్చిగా వుంది. అందులో టైరు గుర్తులున్నాయి. అవి నాలుగడుగుల దూరం వెళ్ళి అదృశ్యమయ్యాయి.

తలెత్తి మళ్ళీ ఇరువైపులా చూశాడు. ఎవరూ లేరు. రావ్ పెరటి తలుపు దగ్గర ఆగి నెట్టి చూశాడు. తెరచుకోలేదు. ఓ క్షణం ఆలోచించి అక్కడినుంచి గబగబా కదిలి వెళ్ళిపోయాడు.

వేగంగా ఇంటిముందు వీధిలోకొచ్చి గేటు దగ్గర ఆగాడు. లైట్లు వెలగడంలేదు. లోపల కారు కన్పిస్తోంది. సందేహించకుండా వెంటనే గోడమీకి దాన్ని చేరు

కొన్నాడు. టార్చివేసి టైరు పరిశీలించాడు. ముందువైపు ఎడమ టైరుకి పేడ అంటివుంది. బాయ్‌నెట్ తెరిచి ఇంజన్ ముట్టుకొని చూశాడు. వేడిగా వుంది....

డోర్ తెరిచి లోన చూశాడు. ఏక్సిలేటర్, బ్రేక్ పెడల్స్ పరిశీలించాడు. వాటిమీద ఫుట్‌బోర్డుమీద తడసిన మట్టి కన్పించింది. దాన్ని కర్చీఫ్‌లో ఎత్తి చుట్టాడు. ఇంకేమీ అతని దృష్టి నాకర్షించలేదు.

డోర్ మూసి ఇంటి వెనక్కి నడిచాడు. బావి దగ్గర నేల మెత్తగా తగిలింది. టార్చివేసి చూశాడు. అక్కడ రెండు అడుగుజాడలున్నాయి. వేగంగా పెరటి తలుపును చేరుకొని చూశాడు. గడపమీద మట్టి అంటుకొని వుంది. దాన్ని కర్చీఫ్‌లో మట్టితో సరిపోల్చుకున్నాడు.

వెనక్కి తిరిగి వరండా తలుపు నెట్టి చూశాడు. లోపల గడియవేసి వుంది. అక్కడనుంచి ఎడమదిక్కు పరిగత్తి పైపు పట్టుకొని చరచరా పైకి ప్రాకసాగాడు.

రెండు నిమిషాల్లో పైకి చేరుకొని బాల్కానీలో దూకాడు. అడుగులో అడుగువేసుకుంటూ బెడ్‌రూం కిటికీ దగ్గరకెళ్ళి ఆగాడు.

లోపల మసగ్గా లైటు వెలుగుతోంది. గది ఇందాకటిలాగా శుభ్రంగా వుంది. బెడ్‌మీద మాధవి కిటికీ వైపు నిద్రపోతోంది. ఆమె ప్రక్కన రావ్ అటు తిరిగి పడుకొని వున్నాడు....

లాల్ వాళ్ళిద్దర్నీ కాసేపు తదేకంగా చూసి అక్కడి నుంచి కదిలాడు. అలసటగా ఇంటికి చేరుకోనేటప్పటికి అక్కడ జాన్ మెట్లమీద సిగరెట్ కాలుస్తూ కన్పించాడు.

"హ్హా! అప్పుడే వచ్చేశావేమిటి?"

"నువ్వు కూడా వచ్చేశావేమిటి?" లాల్ అన్నాడు.

"నా డ్యూటీ అయిపోయింది."

"నా డ్యూటీ కూడా అయిపోయింది."

ఇద్దరూ ఒకర్నొకరు చూసుకొన్నారు అనుమానంగా.

"నిన్ను నమ్మను" అన్నాడు జాన్.

"నిన్నెలా నమ్మమంటావు?" అడిగాడు లాల్.

"ఆల్ రైట్ కూర్చో చెప్తాను. వెన్నెల చక్కగా కాస్తోంది, కమాన్ మాధురి గురించి మనం అపోహ పడ్డాం. ఈ వ్యవహారంలో ఆమెకేమీ సంబంధంలేదు. పూర్తిగా నిర్దోషి. ఆమె ఆ సింధీతో బాటు అతనింటి కెళ్ళింది. అతనికి ముప్పై ఏళ్ళుంటాయి. బేగంపేట పోష్ ఏరియాలో పెద్ద బంగళావుంది. బాగా డబ్బుగలవాడు. అంత డబ్బున్నవాడు బ్లాక్ మెయిలర్ అయ్యే అవకాశం లేదు కదూ?"

"అసలా డబ్బు బ్లాక్ మెయిల్ ద్వారా గడిస్తే ఉండవచ్చు."

"వెల్, అతను బ్లాక్ మెయిలర్‌లా కన్పించలేదు. బిజినెస్ మైండ్ ఫెలో. అలాగే మాధురి ప్రొఫెషన్ మైండెడ్. ప్రక్క దార్లు తెలియవు.

"వాళ్ళతో నేను ఇంట్లోకి అనుసరించాను. వాళ్ళ మాటలకీ మన అనుమానాలకీ సంబంధమేలేదు. వాళ్ళిద్దరి మధ్య వ్యామోహం తప్ప మరే సంబంధంలేదు! అక్కడి నుంచి నిష్క్రమించాను."

"తర్వాత?"

"వెంటనే మాధురి ఇంటికెళ్ళాను. ఎవరూ లేరు. ఆమె బ్లాక్ మెయిలర్ అనేందుకు, లేదా బ్లాక్ మెయిలర్‌తో సంబంధముందనేందుకూ ఆధారాలేమీ దొరక

లేదు. కాబట్టి ఇంకా ఆమెని అనుమానించడం అనవసర మనుకున్నాను....

"ఇప్పుడొక్కటే మార్గముంది. ఈ బ్లాక్ మెయిలర్ ఎవరో తెలియాలంటే మనం రావ్‌ని అనుసరించాలి. అతను ఫోన్ మీద ఏం చూశాడో, ఎక్కడికెళ్ళాడో తెలుసుకుంటే బ్లాక్ మెయిలర్ దొరికిపోతాడు. నువ్వేం తెలుసుకున్నావు?"

లాల్ అన్నాడు. "చాలా తెలుసుకున్నాను. కానీ ఫ్రెష్ న్యూస్ ఏమిటంటే, రావ్ తిరిగి వచ్చాడు. అతని రాక చాలా మిస్టీరియస్‌గా వుంది. కారు ఇంటివెనుక వీధిలో ఆపి, ముందుకు నడిచివచ్చి లోనికెళ్ళాడు. ఇంట్లో అతనేదో చేయాల్సింది చేసి, లేదా చూడవల్సింది చూసి- పెరటి తలుపు ద్వారా కారు చేరుకొని ఇంట్లో తెచ్చి పెట్టాడు. ఆ తర్వాత సుఖంగా నిద్రపోయాడు."

"ఏమిటీ గొడవ! ఏమిటతని ఉద్దేశం?"

లాల్ సిగరెట్ వెలిగించి అన్నాడు.

"ఎలిబీ కావచ్చు. బ్లాక్ మెయిలర్‌ని ఎదుర్కోవడంలో ఏదైనా అనర్థం జరిగిందేమో."

"ఆ బ్లాక్ మెయిలింగ్ బ్రూట్ ఎవరసలు! రావ్ ఎందుకలా ప్రవర్తించాడు, మనల్ని నిర్లక్ష్యం చేసి?"

జాన్ ఉలిక్కిపడి నెమ్మదిగా అన్నాడు, "లాల్, నాదొక సందేహం."

"చెప్పు."

"రావ్ ఒకవేళ ఇంటివెనుక కార్లో కాచుకున్నాడేమో?"

"దేనికి?"

"ఏదైనా అనుమానంతో.... భార్యని అనుమానిస్తుం

డవచ్చు. ఆమె కారెక్టర్ నువ్వు చూశావుగా? రావ్ ఫోన్ మీద ఏమీ లేకుండానే బుకాయించి వుండాలి. అదేమిటో బ్లాక్ మెయిలర్ని వెలికిలాగే ఆధారమనుకొని రావ్ అక్కడికెళ్ళాడని మనం అనుకుంటాం...అనుకుం టున్నాం. కానీ అతనలా తప్పుదోవ పట్టించి ఇంటి వెనుక భార్యమీద నిఘా వేశాడని ఎందుకనుకోకూడదు?"

"ఒక పాయింట్ ఉంది—"

"షూట్!"

"ఆమెమీద నిఘా వేస్తే, ఆమెని రెడ్ హాండెడ్‌గా పట్టుకోవాలనుకుంటే, ఆమె యాక్షన్‌లో ఉన్నప్పుడే ఎంచక్కా నడిచివెళ్ళి అప్‌సెట్ చెయ్యావచ్చు. కానీ అతనలా వెళ్ళలేదు. కిమ్మనకుండా వెళ్ళి భార్యతో నిద్ర పోయాడు. ఆ నిద్ర కూడా అంతలోనే ఎలా ముంచు కొచ్చిందన్నది కూడా మిస్టరీయే!"

"ఎలా?"

"నేను చూసినప్పుడు అతని కారు ఇంజన్ వేడిగా ఉంది. అంటే, నేనక్కడికి వెళ్ళిన సుమారు పదినిమిషాల క్రితం అతనొచ్చి ఉండాలి. ఈ పదినిమిషాల్లోనే భార్య తలుపు తీయడం, అతను లోనికెళ్ళి బట్టలు మార్చుకోడం, లైటార్పేసి నిద్రలో జారుకోవడం ఎలా జరిగాయి? నో, జాన్. రావ్ ఏదో గూడుపుఠాణి సాగించాడు. దాన్ని కప్పిపుచ్చడానికి మన జోక్యం నివారించడానికి నిద్ర నటిస్తున్నాడు—"

"ఓహ్, అయితే మళ్ళీ మొదటికే వచ్చాం. అయితే రావ్ ఫోన్ మీద చూసిందేమిటో నిజమన్నమాట! ఈ మాధవి వ్యవహారం మరీ తల తినేస్తోంది! భర్త ఎప్పు డొస్తాడో తెలియంది ఎలా డాన్సు చేసింది? అసలా క్లూ

ఏమిటో తేల్చకపోతే ఎవరు ఏమిటో బోధపడదు!"

"వెల్, ఎలా తేలుస్తావు?"

జాన్ క్షణం మౌనంగా వున్నాడు.

"రైట్—హో! నువ్వామె డాన్సు చూశావు, తాగటం చూశావు, పేల్చడం చూశావు. ఆమె చాటు వ్యవహారం భర్తకు తెలియకుండా కాపాడాలంటే, ఫోన్ మీద చూసిందేమిటో చెప్పమను!"

"అది బెదిరింపు. బ్లాక్ మెయిల్. ఆ పద్ధతి నాకు నచ్చదు. పైగా ఆ క్లూ ఆమెకు తెలుసని ఎలా అనుకుంటాం? రావ్ తొలగించి ఉండొచ్చు. ఈ విషయం నువ్వే చెప్పావు...రావ్ వచ్చిన వెంటనే నాకు ఫోన్ చెయ్యమని ఆమెకు చెప్పాడు. చెయ్యలేదు. ఆమె చెప్పి ఉండవచ్చు. కానీ రావ్ గిల్టీ కాన్షస్‌తో చెయ్యలేక పోయాడు."

"వెల్, మనకా కాన్సస్ లేదు. మనం చెయ్యొచ్చుగా?"

"అవును, మనమే చేద్దాం."

ఇద్దరూ లేచి ఇంట్లో కెళ్ళారు. లాల్ ఫోన్ ఎత్తి డయల్ చేశాడు.

"హలో, ఎవరూ?"

"హలో, మాధవిగారూ. నేనెవరో మీకు తెలుసు. ఆయన వచ్చారా?"

"ఓహ్, మళ్ళీ మీరా!"

"ఆయన వచ్చారా?"

"వచ్చారు."

"ఎన్ని గంటలకి?"

"పన్నెండు కావస్తోంది."

"ఎక్కడికెళ్ళారో చెప్పారా?"

"లేదు."

"మీరడిగారా?"

"అడిగినా చెప్పలేదు."

"వచ్చినపుడు మనిషెలా వున్నారు?"

"గాభరాగా కన్పించారు."

"నాకు ఫోన్ చెయ్యమని చెప్పారా?"

"చెప్పాను. కానీ ఉదయం కలుసుకుంటానన్నారు. బహుశా నా సమక్షంలో ఆ విషయాలు మాట్లాడ్డం ఇష్టం లేదనుకొంటాను."

"ఏ విషయాలు, మాధవిగారూ?"

"మీ ఇద్దరికీ తెలిసిన విషయాలు."

లాల్ నవ్వాడు, "ఇప్పుడేం చేస్తున్నారాయన?"

"నిద్రపోతున్నారు. లేపమనకండి! ఆయనకు విశ్రాంతి కావాలి. నిద్రపోనివ్వండి. మీ డిటెక్టివ్ లకు రాత్రికీ పగటికీ తేడా తెలియకపోతే మాకు తెలుసు!" ఈ మాటలతో లైను కట్ అయింది.

లాల్ ఫోన్ పెట్టేసి జాన్ కు విషయం చెప్పాడు.

"....కాబట్టి జాన్, మనం కూడా నిద్రపోవడం మంచిది. రాత్రికీ పగటికీ తేడా మనకూ తెలుసు, సిగరెట్ కూ సిగార్ కులా! రేపుదయం రావ్ కలుసుకునేంత వరకు విశ్రాంతి. బ్లాక్ మెయిలర్ రేపు రాత్రివరకు గడు విచ్చాడు. ఆలోపు ఏదో మార్గం తట్టకపోతుందా?"

"మనసుంటే మార్గం ఇప్పుడే తట్టవచ్చు."

"నాకు తట్టదు, అలసిపోయాను."

"నాకు నిద్రపట్టదు. కాలక్షేపం కావాలి."

"నీ కాలక్షేపానికి నేను అడ్డులేను."

"నా కాలక్షేపానికి నువ్వే కావాలి."

"అంటే?"

జాన్ నవ్వాడు. "ఈ బ్రెయిన్ టీజింగ్ క్లూ కోసం కాస్సేపు కుస్తీపడదాం. అదేమిటో తేల్చకపోతే మన శ్యాంతి వుండదు! కమాన్, లెటజ్ స్టార్టు - నాకు తోచింది నేనొకటి చెప్తాను, నువ్వొకటి చెప్పాలి: ఒకటి, సిగరెట్ నుసి."

లాల్ విసుగ్గా చూసి ఆవులించాడు. "కాదు, గ్యాస్ టవ్ మసి."

"జోక్ చెయ్యకు. రెండు, సబ్బు నురుగు."

"నో, గొంగళిపురుగు. ఇది కూడ ప్రాసకుదిరింది."

"షటప్! నన్ను రెచ్చగొట్టకు, లాల్. మూడు, వానిషింగ్ క్రీమ్."

"ఊహుఁ! అదీ కాదు, చూయింగ్ గమ్."

జాన్ ఉలికిపడ్డాడు. "అలాగా? అయితే విను.... చుంబనమ్! వహ్వా!"

లాల్ తల విదిలించాడు. "చుంబనమ్ ...? అంటే?"

"ముద్దాడుట! కిస్సింగ్, మైడియర్!" అరిచాడు జాన్.

"కిస్సింగ్ ....?" లాల్ తికమక పడ్డాడు.

"యురేకా!" జాన్ అరిచాడు మళ్ళీ, "పార్ట్నర్! రావ్ ఫోన్ మీద చూసిందేమిటనుకున్నావ్?"

"ఏమిటి?"

"డోంట్ బి చైల్డిష్! లిప్‌స్టిక్ యార్. లిప్‌స్టిక్ మరక!"

"లిప్‌స్టిక్ మరక...? ఎలా వచ్చింది?"

"ఎలా వస్తుంది! మాధవి కిస్ ఇచ్చింది. అది సరిగ్గా మౌత్ పీస్ మీద వుంది!"

"ఎవరికిచ్చింది?"

"ఎవరికిస్తుంది! భర్తకనుకున్నావా? అనుకుంటే నువ్వు ఫూల్ వి! బాయ్ ఫ్రెండ్ కిచ్చింది! అతనెవరో రావ్ కు తెలుసు. ఫోన్ మీద ఆ మరక చూసి, కుట్ర పసిగట్టాడు. అతనే బ్లాక్ మెయిలర్ అనుకొని పరిగెత్తాడు—"

"ఆగు, జాన్. బ్లాక్ మెయిలర్ ఎవరో రావ్ కు తెలిసి ఉంటే, హెచ్చరిక చేసినపుడు అతని గొంతు గుర్తించే వాడు. కానీ ఆ కంఠంతో పరిచయంలేదని నాతో అన్నాడు."

"గొంతు మారిస్తే గుర్తించలేదు. రావ్ కి బ్లాక్ మెయిలర్ ఎవరో తెలుసు—మాధవి బాయ్ ఫ్రెండ్."

"అయితే రావ్ అతని దగ్గరికెళ్ళాడా? వెళ్ళి ఏం చేశాడు, మేసన్ ది జూనియర్?"

"నేనెవరికీ జూనియర్ ని కాదు, బాస్. అభిమానిని. ఆదర్శంగా తీసుకొనేవాడిని. నీకు తెలుసు, రావ్ ఆ బాయ్ ఫ్రెండ్ ని పట్టుకొని వీపు బ్రద్దలు చేసి నెగెటివ్స్ లాక్కొని ఉంటాడు. లేదా—"

"లేదా...?"

"ఇంటినుంచి బయలుదేరిన ఆవేశంలో ఆ బాయ్ ఫ్రెండ్ ని...వద్దు, ఆ శిశువుని దేవుడు రక్షించుగాక!"

"వెల్, అంతా నీ వూహాగానం. నువ్వు చెప్పిన కథ నిజంకాకపోతే మళ్ళీ మరో థియరీ అల్లుకురావాలి..' ఇక నిద్రపోనిస్తావా? విష్యూ గుడ్ నైట్ అండ్ హారిబుల్ డ్రీమ్స్" అన్నాడు లాల్.

6

తెల తెలవారుతోండగా లాల్ బెడ్ ప్రక్కన ఫోన్ మ్రోగనారంభించింది. బద్ధకంగా కళ్ళు తెరిచి రిసీవరెత్తాడు.

“ఇంకా తెల్లవారకుండా ఎవరది!” కసిరాడతను.

“లాల్,” మాధవి కంఠం అర్చింది, “మీరు త్వరగా రావాలి.”

లాల్ పూర్తిగా తేరుకున్నాడు. “ఎందుకు? ఏం జరిగింది?”

“ఓహ్...ఎలా చెప్పను! ఆయన—ఆయన—”

“చెప్పండి! ఆయనకేమయింది?”

“ప్రాణాలు తీసుకున్నారు!”

“ఎలా?”

“ఉరిపోసుకున్నారు! పెరట్లో.... వేపచెట్టుకి!”

“ఎప్పుడు?”

“తెలియదు! మీరు త్వరగా రండి! నేనిక్కడ—”

“వెంటనే వస్తున్నాం—” లాల్ రిసీవర్ పెట్టేసి బెడ్ మీంచి దూకాడు. జాన్ బెడ్ మీద కూర్చొని కలవరంగా చూస్తున్నాడు.

“ఏదైనా ఘోరం జరిగిందా, పార్ట్నర్?”

“దారుణం జరిగింది! రావ్ ప్రాణాలు తీసుకున్నాడు....” అని మాధవి మాటలు చెప్పాడు లాల్.

“ఇంపాసిబుల్!” అర్చాడు జాన్. “జగపతిరావ్! సూసైడ్! వీల్లేదు! ఆత్మహత్య చేసుకొనే కారణం ఏదీ లేదు! పరిస్థితి ఏమీ విషమించలేదు!”

“ఎలా తెలుసు? బ్లాక్ మెయిలర్ని డీల్ చేసి ఉంటే— వ్యవహారం బెడిసికొట్టిందేమో? పరిస్థితి అతని ప్రతిష్టకు

భంగకరంగా పరిణమించిందేమో?"

"ఓహ్, నువ్వింకా పాత ధియరీ ఆలోచిస్తున్నావు. కొత్త థియరీలో క్లూ దొరికింది! బాయ్ ఫ్రెండ్ ప్రవేశించాడు! ఇప్పుడది ఆత్మహత్య అంటే అనుమానాస్పదంగా వుంది. నేను నమ్మను. ఎవరూ నమ్మించలేరు.... ఏదో కిటుకువుంది లాల్, ఎక్కడో ఏదో తట్టి తప్పిపోతోంది. లెట్ మీ సీ.... వెల్, వెల్! నీకేం తెలుసు! ఈ ట్రిక్ చూడు కాస్త—"

జాన్ తటాలున బెడ్ దూకి ఫోన్ అందుకున్నాడు.

చకచకా ఒక నెంబర్ తిప్పాడు.

"హలో.... ఎవరూ?" అంది అవతలి కంఠం.

జాన్ అకస్మాత్తుగా మెలికలు తిరగ సాగాడు. కంఠం మార్చి తాగినవాడిలా గజిబిజిగా మాట్లాడ సాగాడు.

"హల్లో! మధూ డార్లింగ్.... నేను.... నేను.... ఏయ్, బేరర్! ఐ విల్ కిల్ యూ! దూరంగా వుండు! నన్ను డార్లింగ్.... డార్లింగ్ తో మాట్లాడనీయ్...."

"ఓహ్, సావన్! ఏం జరిగింది?"

"డార్లింగ్.... నేనిక్కడ.... బార్ ర్ లో...."

"ఏమైంది? బార్ లో ఏం చేస్తున్నావ్?"

"ఓహ్, డియర్! టూ గేసాను బాగా.... పిత్తుగా టూగేసాను! ఆ పని షేసినప్పటినుంచీ మనషు పాడయింది.... అందుకే టూగేసాను—"

"ఓహ్, ఇంటికెళ్ళలేదా నువ్వు?"

"ఏమిటీ.... హింటికా?.... లేదు. ఇక్కడే.... బార్ లో యూ బేరర్! ఐషే.... ఐషే.... అవుట్ యూ గో!"

"సావన్! ఏం జరుగుతోందక్కడ?"

"డార్లింగ్ .... పిట్టుగా టూగేస్తాను.... మత్తుగా...."

"ఓహ్, బార్‌లో ఏం చేస్తున్నావ్? ఎందుకెళ్ళావ్? తిన్నగా ఇంటికెళ్ళమన్నానా?"

"ఇంటికి.... దారెక్కడ డార్లింగ్?"

"షటప్! ఆ గ్లోవ్స్ నీ దగ్గరే వున్నాయా?"

"గ్లవ్స్ .. ఆ అవుణుఁ! ... ఉన్నాయ్."

"వాటిని పారేయ్. వెంటనే ఇంటికెళ్ళిపో!"

"కానీ దారి.... దారి.... డార్లింగ్, దారి తెలియదు! అంతా మాయ! సగమే మాయ.... అంతా మోసం. దగా! డబ్బు చేయించే పనులు — బేరర్! యూ లిటిల్ బాష్టర్డు! ఐ విల్ రియల్లీ కిల్ యూ నా! స్క్రామ్—"

"సావన్! ఏమిటది?"

జాన్ వెంటనే గొంతు మార్చేసి ప్రాధేయపడుతూ అన్నాడు.

"మేం సాబ్, ఈయన బాగా డోస్ పుచ్చుకొని పడిపోయాను. కదలడం లేదు. రాత్రినుంచీ.... తెల్లారింది. ఇంటికి పంపుదామంటే దారి తెలియదంటున్నారు. మీరన్నా చెప్పండి, లేదా మీరే ఇక్కడికి రండి. ఏదో ఒకటి చెయ్యండి త్వరగా! ఈయనతో వేగలేక పోతున్నాం.—"

"ఓహ్, సావన్. ఎందుకిలా చేశావ్! సరే, బేరర్. ఆయన్ని ఆటో ఎక్కించి మెహదీ పట్నంలో...."

జాన్ వెంటనే ఆష్ట్రేలో వేలుముంచి సిగరెట్ నుసితో టీపాయ్‌మీద పొడుగ్గా వున్న ఇంటి నెంబర్ గీశాడు.

క్షణంలో ఆ నెంబర్‌ని మెదడుకెక్కించి, "అలాగే మేంసాబ్, థాంక్యూ!" అని రిసీవర్ పెట్టేశాడు.

లాల్ కళ్ళప్పగించి చూస్తున్నాడు.

"ఏమిటది, జాన్?"

"నువ్వెంటనే మాధవి దగ్గరికెళ్ళు! నేను త్వరగా వస్తాను. కారు తీసుకెళ్తున్నాను. నువ్వు టాక్సీలో వెళ్ళు!" అంటూ క్షణం కూడా ఆగకుండా పైజామా లోనే బయటికి పరిగాడు జాన్.

7

పావుగంటలో లాల్ రావ్ ఇంటిముందు టాక్సీదిగి లోని పరిగాడు. మాధవి హాల్లో ఎదురై పట్టుకుంది.

"నన్ను క్షమించండి, లాల్! ఇలా అవుతుందనుకో లేదు! మీతో చాలా దురుసుగా ప్రవర్తించి—"

లాల్ ఆమెని విడిపించుకొని, "ముందు ఆతన్ని చూడ నివ్వండి!" అంటూ ముందుకు సాగిపోయాడు.

మరికొన్ని నిమిషాలలో తెల్లవారుతుంది. మసక వెలుర్లో పెరట్లో నిశ్శబ్దంగా వుంది.. వాతావరణం చలిగా వుంది. పెరట్లో ఎడమవైపు గోడదగ్గర బావి, బాత్ రూం వగైరా వున్నాయి. కుడివైపు పెద్ద వేపచెట్టువుంది. దాని బలిష్ఠమైన శాఖలు కొన్ని గోడదాటి వీధిలోకి వ్యాపించాయి...లోపలివైపు ఒక కొమ్మకు ఒక మానవాకారం వ్రేలాడుతూ కన్పిస్తోంది.

జగపతిరావ్ నిర్జీవాకారాన్ని లాల్ దగ్గరగా, స్పష్టంగా చూశాడు. అతను లుంగీ బనియన్‌లో వున్నాడు. మెడకి బిగుతుగా ఉక్కు తీగతో ఉరి వుంది. దేహం నేలకి మూడడుగుల ఎత్తున వ్రేలాడుతోంది.

లాల్ అయిష్టంగానే శవం ముఖం చూశాడు.

అన్యమనస్కంగా, నిర్లిప్తంగా, కాళ్ళీడ్చుకుంటూ తిరిగి ఇంట్లోకెళ్ళాడు.

మాధవి వెక్కి వెక్కి ఏడుస్తోంది సోఫాలో. లాల్ ఆమె ఎదురుగా కూర్చొని సిగరెట్ వెల్గించి పోయిన చైతన్యం పుంజుకున్నాడు.

"వెల్, ఇది దారుణం. నేనిలాంటి పరిణామం ఆశించలేదు. మీ ఇద్దర్లో ఎవరూ మాతో సహకరించలేదు. మీకిప్పుడు గిల్టీ కాన్షస్ తప్ప ఏమీ మిగల్లేదు. చెప్పండి, ఆయన్నెప్పుడు చూశారు?"

ఆమె తేరుకొంటూ అంది. "ఇందాకే చూశాను— మామూలుగానే తెల్లవారకుండానే లేచానీవాళ. ప్రక్కన ఆయనలేరు. ఆయన బాగా పొద్దుపోయాక గానీ లేవరు, ఎప్పుడూ - బాత్ రూంకెళ్ళి వుంటారేమో ననుకొని పెరట్లోకెళ్ళాను. అప్పుడే చూశాను—"

"రాత్రి తిరిగివచ్చాక ఆయనెలా కన్పించారు?"

"చాలా అప్ సెట్ అయ్యారు. ఆందోళనగా కన్పించారు. నాతో ఏమీ చెప్పలేదు. మీ గురించి చెప్పాను. కానీ ఇప్పుడంతా మించిపోయిందనీ, ఎవరూ చేయగల్గిందేమీ లేదని అన్నారు."

"ఐసీ...ఆయన వచ్చినప్పుడు మీరేం చేస్తున్నారు?"

"అప్పుడే నిద్రకుపక్రమించాను."

"ఆయన వచ్చి భోజనం చేశారా?"

"లేదు...పన్నెండు కావస్తోంది. రావడంతోనే పైకెళ్ళి నిద్రపోయారు."

"ఆయన చెప్పు లెక్కడున్నాయి?"

"పైన బెడ్ రూంలో. ఎందుకు?"

"వాటిని చూడాలి."

"వాటికేమైంది?"

"మట్టి అంటింది."

"మీ కెలా తెలుసు?"

"చెప్పులకి మట్టిగాక బంగారం అంటుతుందనుకోను."

"కానీ ఇప్పుడెలా అంటిందని!"

"ఏమిటిది?"

"మట్టి,"

"చెప్తాను, పదండి."

"ముందు—ముందాయన్ని—" గొణిగిందామె.

"ఆయన్ని మనం ఏమీ చెయ్యలేం, పోలీసులొచ్చే వరకూ."

లాల్ లేచి మేడ మెట్లెక్కసాగాడు. ఆమె ఆత్రతగా వెంబడించింది. లాల్ బెడ్రూంలోకెళ్ళి ఆగిపోయాడు. అతని దృష్టి నలుమూలలా పడింది. ఎక్కడా అసహజంగా, ప్రత్యేకంగా ఏమీ కన్పించలేదు. టేబిల్ దగ్గర రావ్ చెప్పుల్ని చూసి వాటిని అందుకున్నాడు. కాని అవి అతను ఆశించినట్లుగా లేవు. అక్కడ మరో జత లేదు.

"మీ రేదో మట్టి అన్నారు—" మాధవి గొణిగింది.

"ఈ చెప్పులకి లేదు" లాల్ అన్నాడు.

"ఆయనకున్నది ఇదొక్కటే జత."

"అయితే నేను పొరబడివుంటాను, ఫోన్ ఎక్కడ?" అన్నాడతను ఫోన్ వైపు కదుల్తూనే. మాధవి తటాలున ముందుకెళ్ళబోయింది. కానీ నిర్ణయం మార్చుకుంది.

లాల్ రిసీవరెత్తి చూస్తున్నాడు. ఎక్కడా మరకలు లేవు. మౌత్ పీస్ శుభ్రంగా వుంది. తలెత్తి ఆమెని ఓరగా చూసి ఒక నెంబర్ డయల్ చేశాడు.

మౌత్ పీస్ ముక్కుకానించి వాసన పీలుస్తూ, "ఎవరక్కడ?" అన్నాడు.

మాధవి కళ్ళప్పగించి చూస్తోంది.

"యస్! డిసీజ్ సార్జెంట్ నవీన్‌చంద్ర ప్లీజ్!" వచ్చింది సమాధానం.

"ఓహో.... కలం ఉందా?"

"ఉంది,"

"అయితే వ్రాసుకో."

"చెప్పండి."

"సోమాజిగూడ నెహ్రూ కాలనీలో నూటనాల్గో నెంబర్ ఇల్లు. ముందు గేటు, లోన తోట, వెనుక పచ్చటి మేడ వుంటాయి...."

"ఏం జరిగిందక్కడ?"

"ఈ రెండింట్లో ఏదైనా కావచ్చు. సూసైడ్, మర్డర్. వెంటనే మీ స్క్వాడ్‌ని నిద్రలేపి పంపు!"

"హలో, హలో, ఎవరుమీరు?"

"లాల్!" చెప్పి ఫోన్ పెట్టేశాడు.

8

ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణన్ కారు దిగి ఠీవిగా నడచి వచ్చాడు.

"హలో, ఫ్రెండ్! గుడ్‌మార్నింగ్ ఎర్లీ మార్నింగ్. రిసెప్షన్ కమిటీలో ఏదో లోపం కన్పిస్తోంది...."

"జాన్ మరో గెస్టుకోసం వెళ్ళాడు" లాల్ అన్నాడు.

"ఎవరా గెస్టు?"

"చాలా ఉపోద్ఘాతముంది, తర్వాత చెప్తాను."

"ఆల్‌రైట్. కమాన్ బాయ్స్, రన్ ఎలాంగ్."

నిపుణుల సిబ్బంది కారు దిగి ఇంట్లోకి పరిగెత్తారు.

లాల్ వెనక కృష్ణన్‌తో వెళ్ళాడు.

"డాక్టర్ ఏడి?"

"కబురు పంపాను, వచ్చేస్తాడు. ఈ చావుకి కారణ

మేమిటి?"

"బ్లాక్ మెయిల్."

"ఐసీ...." కృష్ణన్ అన్నాడు.

"యూ విల్ సీ ఎ లాటాఫ్ థింగ్స్, కమాన్" లాల్ వేగంగా పెరట్లోకి దారితీశాడు.

ఇప్పుడు పూర్తిగా తెల్లారింది. రావ్ మృతదేహం వ్రేలాడుతూ స్పష్టంగా కన్పిస్తోంది. ఇద్దరు ఫోటో గ్రాఫర్లు స్నాప్స్ తీశారు. లాల్ ఇప్పుడు శవాన్ని పరీక్షగా చూస్తున్నాడు. కళ్ళు, నోరు మూసివున్నాయి. ముఖం ప్రకాశవంతంగా వుంది ...చావు అతన్ని బాధించినట్లు లేదు. అతని మెడచుట్టూ సన్నటి ఉక్కుతీగ రెండు చుట్లు తిరిగివుంది. మిగిలిన మూడడుగుల రెండవ చివర అతని కుడిచేతికి చుట్టివుంది. చెయ్యి అరపిడికిలి బిగుసుకొని వుంది. ఎడమ చేతివేళ్ళు నిక్కబొడుచుకొని, కొయ్యబారి వున్నాయి.

నేలమీద, అతని కాళ్ళదగ్గర ఒక చిన్న స్టూలు అడ్డంపడి వుంది. లాల్ దాన్ని కర్చీఫ్‌తో ఎత్తి కాళ్ళ క్రింద పెట్టాడు. పాదాలు దానిమీద అనలేదు. నాలుగంగుళాలు పైకి వున్నాయి. కృష్ణన్ ఆశ్చర్యంగా చూశాడు. లాల్ ఓ క్షణం సాలోచనగా నిలబడి స్టూలు మీద వేలిముద్రలు, పాదముద్రలకోసం పరిశీలించమన్నాడు.

ఆ తర్వాత వంగి శవం అరికాళ్ళను పరీక్షించాడు. అతని ముఖకవళికలు మారాయి.

అక్కడినుంచి వేగంగా కదిలి బావిదగ్గరికెళ్ళాడు. అక్కడ నేలలో అడుగుజాడలు అలాగే వున్నాయి. లాల్ చేతిలో వున్న రావ్ చెప్పుతో ఆ అడుగుజాడల్ని

పోల్చి చూశాడు. అవి రావ్ అడుగుజాడలు కావు. అతనికంటే పొడవైన పాదాలవి. బూట్స్ జాడలు.

వెంటనే తలుపుతీసి వెనుక వీధిలోకెళ్ళాడు. వీధిలో సరిగ్గా తలుపుకెదురుగా, పేడముద్దలోంచి వెళ్తున్న టైరు గుర్తులు కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి-సిమెంట్ రోడ్డు మీద ఆరిపోయి. అతనక్కడ నిలబడి చుట్టూ చూడ సాగాడు చురుగ్గా.

"ఏమిటి చూస్తున్నారు?" కృష్ణన్ అన్నాడు వెనుక నుంచి.

"సిగరెట్ బట్స్. డిటెక్షన్‌లో సిగరెట్ పీకలకి చాలా ప్రాధాన్యత వుంది. అలవాటుచొప్పున కాల్చేవారు సమయం, సందర్భం, స్థలం మొదలైనవి విచక్షణా జ్ఞానం లేకుండా కొన్ని పొరపాట్లు చేస్తుంటారు....అదుగో పీక!"

లాల్ మెరుపులా వెళ్ళి రోడ్డువారగా పడివున్న సిగరెట్ పీకను చూశాడు. దాన్ని కర్చీఫ్‌తో అందుకొని, "వెల్, వెల్, ఇది రావ్ బ్రాండ్ కాదు" అన్నాడు.

"ఇది రావ్ ప్రాపర్టీ కాదు. పబ్లిక్ వీధి. ఎవరైనా పారేసి వుండవచ్చు."

"ఎవరు పారేశారో నాకు తెలుసు. ఇదే బ్రాండ్ రాత్రి ఒకరి దగ్గర చూశాను. మీరు బావిదగ్గర అడుగు జాడలు చూశారా?"

"చూశాను. పోతపోసినట్లున్నాయి."

"ఫోటోలు తీయండి. ఈ టైర్ ప్రింట్స్ కూడా తియ్యండి. అలాగే రావ్ కారుమీద వేలిముద్రలు చూడండి. ముఖ్యంగా డోర్ హేండిల్, స్టీరింగ్, గేర్ లివర్ మీద."

"....అయితే ఇది హత్య అన్నమాట!" అన్నాడు కృష్ణన్.

"ఇన్స్పెక్టర్ ఎక్కడ?" లోపలినుంచి డాక్టర్ అరుపు వినిపించింది.

లోపల డాక్టర్ రఘునాథ్ శవాన్ని చూస్తూ నిలబడ్డాడు. వెనుక ఇద్దరు మార్గ్ అటెండెంట్లు స్ట్రెచర్ తో నిలబడివున్నారు.

లాల్ డాక్టర్ని విష్ చేశాడు.

డాక్టర్ శవంచుట్టూ ఓ ప్రదక్షిణం చేసి ఆగాడు. అతని ఎక్స్‌రే కళ్ళు గ్రహించవల్సిన అంశాల్ని అన్వేషిస్తున్నాయి. అతని ముఖంలో ఆశ్చర్యం వ్యక్తమవసాగింది. చివరికి కృష్ణన్ వైపు తిరిగి అన్నాడు.

"గుడ్ గాడ్, ఇన్స్పెక్టర్, ఇదేం కేసనుకున్నారు?"

"ఏం కేసు?"

"పోస్టుమార్టమ్ హేంగింగ్!"

కృష్ణన్ లాల్ని చూశాడు. లాల్, డాక్టర్ వేపు చూశాడు.

డాక్టర్ అన్నాడు మళ్ళీ. "అతను ఉరిపోసుకోలేదు. ఇది ఆత్మహత్యకాదు. ఉరిపోసుకొన్న చిహ్నాలెక్కడా లేవు. చెట్టుకొమ్మకు తీగముడి చూశారా? ముడి పైభాగంలోవుంది. అతను ఉరిపోసుకునుంటే అది క్రిందికి వుండాలి—ముడి సాధారణంగా క్రిందివైపుకే వేస్తారు. ఒకవేళ పైకే వేసారనుకోండి, అప్పుడు దేహం బరువుకి, అదిచ్చే జర్క్ వల్లా ముడి తప్పకుండా క్రిందివైపుకు తిరుగుతుంది. అదే శవాన్ని వ్రేలాడదీస్తే తీగ పైకిలాగి ముడతాము గనుక ముడి పైన వుండిపోతుంది—స్థిరంగా. అప్పుడు జర్క్‌కు అవకాశం వుండదు."

"అవును, ఇక్కడ ముడి పైకే వుంది" అన్నాడు లాల్.

"మరో విషయం. క్రింద ఆధారం చూడండి. స్టూలు పాదాల కానడంలేదు. నాలుగంగుళాలు పైకివున్నాయి. వురి పోసుకుంటే దేహం కుంచించుకుపోదు-పైగా దాని బరువుకి మెడ సాగవచ్చు. తీగ, లేక తాడుకూడా సాగే అవకాశముంది. అంతేగాక పైన ఆధారం—ఇక్కడ చెట్టుకొమ్మ-క్రిందికివంగే అవకాశం వుంది. కాబట్టి నిలబడ్డ ఆధారంకంటే కాళ్ళు కొన్ని సందర్భాల్లో ఇంకా క్రిందికి వ్రేలాడుతుండే వీలుంది. కాని ఇక్కడ అందుకు వ్యతిరేకంగా కన్పిస్తోంది...."

డాక్టర్ ఇంకా అన్నాడు. "వురి పోసుకుంటే నాలిక బయటికొచ్చి వుండాలి. ఏదీ?కళ్ళు పెల్లుబికిరావాలి. అదీ లేదు. ముక్కునుంచీ, చెవులనుంచీ రక్తం స్రవించాలి ... ఇవీలేవు. అతి సామాన్యంగా కన్పించే చిహ్నాలేవీలేవు. కాబట్టి ఇతను ఉరిపోసుకోలేదు— మరణించాక వ్రేలాడ దీయబడ్డాడు.... పోస్టుమార్టమ్ హేంగింగ్."

"ఎలా మరణించాడు?" కృష్ణన్ అడిగాడు.

డాక్టర్ లాల్ వైపు తిరిగాడు, "డిటెక్టివ్ ఫ్రెండ్, కేసు ఎలాటిది?"

"ఎమర్జెన్సీ కేసు....ఇంతకు చాలాపూర్వంనుంచి మేం దర్యాప్తు చేస్తున్నాం—అంటే ఈ చావుకు ముందునుంచీ. చాలా ఆధారాలూ, సందేహాలూ ఉత్పన్నమయ్యాయి. మీరిపుడు కొంచెం శ్రమతీసుకుని మరణం ఎప్పుడు ఎలా సంభవించిందో ఇక్కడే తెలియజేస్తే, కేసుకూడా ఇప్పుడే తేలిపోవచ్చు."

"ఆల్ రైట్, శవాన్ని దించండి! ఇక్కడే నమూనా

పోస్టుమార్టమ్ ప్రారంభిద్దాం, లాల్ కోరికమీద."

"థాంక్యూ వెరీమచ్."

శవాన్ని దించుతున్నప్పుడు డాక్టర్ అన్నాడు. "చూడండి ఈ దృశ్యాన్ని సృష్టించిన వ్యక్తుల ఉద్దేశం హతుడు స్టూలుమీద నిలబడి, కొమ్మకు కట్టిన తీగను మెడచుట్టూ బిగించుకొని, దాని రెండో చివర చేతికిచుట్టు కొని బలంగా లాగుతూ క్రింద ఆధారాన్ని తన్నేసినట్లు కన్పించాలని."

"అవును. అయితే మీరు 'వ్యక్తులు' అనడంలో ఉద్దేశం ఏమిటి?" కృష్ణన్ అడిగాడు కుతూహలంగా.

"శవాన్ని వ్రేలాడదీయడం ఒక్కరివల్ల కాదుగనుక."

"అయితే ఎందరు కావచ్చు?"

"ఇద్దరు కావచ్చు," లాల్ అన్నాడు.

వరండాలో దుప్పటి పరచి దానిమీద శవాన్ని చేర్చారు.

డాక్టర్ మోకాళ్ళమీద కూర్చొని పరీక్ష ప్రారంభించాడు.

లాల్ శవం అరికాళ్ళను తదేకంగా చూడసాగాడు. అది పసిగట్టి కృష్ణన్, "లివిడిటీ అరికాళ్ళలో లేదు!" అన్నాడు.

డాక్టర్ కళ్ళెత్తి ఓరగాచూశాడు. కృష్ణన్ గర్వంగా నవ్వాడు.

డాక్టర్ అన్నాడు, "అవును. లివిడిటీ అరికాళ్ళలో లేదు. చేతి వేళ్ళలోను, నడుములోనూ లేదు. ఉరిపోసు కుని వ్రేలాడుతున్నపుడు గురుత్వాకర్షణకి దేహంలోని రక్తమంతా క్రింది వైపుకి లాగివేయబడి, దేహం పాలి పోయినట్టు కన్పిస్తుంది. అలా క్రిందికి దిగిన రక్తమంతా

అరికాళ్ళలో చేరి అక్కడ గడ్డకడుతుంది. అప్పుడు చర్మం నుంచి ఆ మచ్చలు స్పష్టంగా కన్పిస్తాయి.... చేతుల మునివేళ్ళలోనూ, నడుములోను కూడా అస్పష్టంగా కన్పిస్తుంది ఈ లివిడిటీ.

"కానీ ఈ కేసులో అలా లేదు. పోస్టుమార్టమ్ లివిడిటీ శవం పృష్టభాగంలో డెవలప్ అయింది—భుజాల మీదా, వీపుమీద. కాబట్టి దీన్నిబట్టి చావు సంభవించాక శవం చాలా సేపు— అంటే దేహంలోని రక్తమంతా ఘనీభవించడానికి పట్టేకాలం సుమారు నాలుగుగంటల సేపు వెల్లికిలా పడివుందన్నమాట. ఆ తర్వాత ్రవేలాడదీయబడింది.

"అలా శవస్థితి మారినప్పుడు దాని కనుగుణంగా—ఒకవేళ ద్రవరూపంలో రక్తం ఇంకా మిగిలివుంటే—లివిడిటీకూడా ఆయాభాగాలకి మారవచ్చు. కానీ మౌలిక ప్రాంతాల్లో దాని తాలుకు చిహ్నాలు అస్పష్టంగానైనా వుంటాయి. ఈ శవం మౌలికస్థితిలో ఉన్నప్పటి మచ్చలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. రక్తం పూర్తిగా గడ్డకట్టడం వల్ల మారిన శవస్థితి కనుగుణంగా లివిడిటీ మారలేదు."

"అయితే మరణం ఎప్పుడు సంభవించింది?" కృష్ణన్ అడిగాడు.

"రఫ్ అయిడియా—రాత్రి ఎనిమిదీ పది మధ్య."

"ఏమిటీ....ఎనిమిదీ పది మధ్యా?" లాల్ ఆశ్చర్యంగా అన్నాడు.

"అవును,"

"కాదు! అప్పుడతను మరణించే అవకాశంలేదు! మీరు పొరబడుతున్నారు,"

డాక్టర్ పెద్దగా నవ్వాడు. "ఇన్నేళ్ళ సర్వీసులో

కూడా పొరపాట్లు!"

"మీరు నమ్మకంగా చెప్తున్నారా?"

"లేదు, మీరు మర్చిపోతున్నారు. ఇది నమూనా పోస్టుమార్టమ్. అందువల్ల ఇది రఫ్ అయిడియా. రిగర్ మార్టిస్ దేహమంతటా వ్యాపించింది.... వాతావరణంలో తేమ ఎక్కువ వుంది. మంచు కురిసింది. కనీసం ఎనిమిది గంటలు వెనక్కి కొలవండి. రాత్రి పది గంటలవుతుంది. మరి కాస్త సడలించాలనుకొంటే మరో రెండు గంటలు కలపండి. అంతే, అది లిమిట్. మామూలు గృహస్థ వాతావరణంలో, అంటే ఇన్ డోర్ లో రిగర్ మార్టిస్ పూర్తిగా ఆక్రమించుకోడానికి పన్నెండు గంటలవ్యవధి పడుతుంది."

"అయితే చావు ఎలా సంభవించింది?"

"స్పృహ పోగొట్టి వ్రేలాడదీయలేదని మీకు తెలుసు. అప్పుడు లివిడిటీ అరికాళ్ళలో కన్పించేది. పోతే తీగతో గొంతు నలిపి చంపలేదు. అలా వూపిరాడక చనిపోయినప్పుడు— ఉరిపోసుకున్నప్పుడుకూడా—లివిడిటీ ఎరుపు కలిసిన ఊదారంగులో ఏర్పడుతుంది. సైనేడ్ వంటి విష ప్రయోగంలో గాఢమైన ఎరుపు రంగులోనూ, చలి, లేదా ఫ్రిజ్ వాతావరణానికి గురైనప్పుడు ఈరక్తవర్ణం నారింజ రంగులోనూ వుంటాయి.

"కానీ ఇక్కడ అలాటి నిదర్శనాలులేవు. నావూహ చావు మెదడులో బ్లీడింగ్ వల్ల సంభవించిందని."

"ఎలా?"

"ఇక్కడ చూడండి తలమీద—మూడుచోట్ల బొప్పి కట్టింది. దేనితోనో కొట్టివుండాలి. మెదడులో రక్తనాళికలు చిట్లి హెమరేజివల్ల ప్రాణంపోయిందని."

"ఐసీ, డాక్టర్..."

డాక్టర్ మళ్ళీ అన్నాడు, "ఇప్పుడు ఈ తీగను చూడండి. చాలా గరుకుగా వుంది. ఇతను గనుక ఈ తీగను మెడికి చుట్టుకొని, రెండో చివరను చేతికి చుట్టుకొని లాగివుంటే అరచెయ్యి గాయపడేది. కాని చెయ్యి ఎక్కడా గీరుకుపోలేదు. చర్మం కూడా ఎక్కడా చిట్లలేదు. అసలు ఇలాంటి తీగతో ఇంతటి బాధాకరమైన చావు నెవరు కోరుకుంటారు? ఈ తీగతో శవాన్ని వ్రేలాడదీసిన వ్యక్తి ఎవరో చేతులకి కవచం తొడుక్కొని వుండాలి."

"గ్లోవ్స్," అప్రయత్నంగా అన్నాడు లాల్.

"ఆ గ్లోవ్స్ తప్పక చిరిగివుండాలి, తీగ రాపిడికి." కృష్ణన్ అన్నాడు.

డాక్టర్ తలూపాడు. "ఇంతకంటే నేను చెప్పవల్సిందేమీ లేదు ప్రస్తుతం. ఏమైనా సందేహాలున్నాయా, మిస్టర్ లాల్?"

"నో, డాక్టర్. థాంక్యూ."

"ఆల్ రైట్, ఈ ఎడమచేతిని ఒకసారి చూడండి. బొటనవ్రేలికేమిటిది?"

లాల్ వేలుపట్టి చూశాడు "ఎర్రటి మరక—"

"రక్తం కాదుగదా?" కృష్ణన్ ముందుకువంగి వాసన చూశాడు, "ఈ వాసన—ఇది లిప్‌స్టిక్ రంగు!" అర్చాడతను.

లాల్ ఒక్కక్షణం కొయ్యబారిపోయాడు. తేరుకొని "వెరీ వెల్, ఆ క్లూ ఇలా స్థానం మారిందన్నమాట!" అన్నాడు మెరుస్తున్న కళ్ళతో.

"ఇది ఏం క్లూ మిస్టర్ లాల్?"

"నా పార్ట్‌నర్ చెప్పిన క్లూ! థాంక్యూ వెరీమచ్, డాక్టర్! మీరు చాలా సహాయపడ్డారు."

లాల్ లేచి వేగంగా ఇంట్లోకి దారితీశాడు.

9

బెడ్‌రూంలో మాధవి ఉలికిపడి చూసి, "ఏంజరిగింది లాల్!" అంది.

లాల్ లోనికెళ్లి ఆమె ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు. సిగరెట్ వెలిగించి ఆమెనోసారి చూశాడు.

"మిమ్మల్ని చూసి నాకూ చాలా ఆశ్చర్యమేసింది," అన్నాడు నెమ్మదిగా, "జగపతిరావ్ భార్య అంటే ఎంతో వృందాగా, పెద్దరికం ఉట్టిపడుతూ, నా తల్లి వయసులో ఉంటుందనుకున్నాను.... మీరాయన రెండవ భార్యా"?

ఆమె అయోమయంగా తలూపింది.

"వెల్, ఆయన మళ్లీ పెళ్ళిచేసుకున్నారని నాకు తెలియదు. సరే, జరిగిందాని కంతటికీ మీరే బాధ్యులు. నేను పూర్తిగా నమ్ముతున్నాను. మొదట మీరు భర్తకు ద్రోహం చేశారు. దానికి సప్లిమెంట్‌గా ఇప్పుడు ప్రాణాలు తీశారు ... మీ చేతులిప్పుడు మంచివికావు. అవి పాప పంకితమయ్యాయి ఆయన ప్రాణాలుతీసి."

"ఆయన ప్రాణాలు నేను తీశానా!"

"మీరే తీశారు."

"ఎలా అంటున్నారు?"

"నా అంతరాత్మ అంటోంది."

"యూ బ్లడీ—"

లాల్ నవ్వాడు "తెలుగులో తిట్టండి, మంచి ఎఫెక్ట్

వుంటుంది. మీ బాయ్ ఫ్రెండ్ కూడా తాగి తెలుగులోనే తిట్టాడు."

"ఎవరూ?"

"మీ బాయ్‌ఫ్రెండ్. బార్లో తాగి బాగా గొడవ చేశాడు."

"మీ కెలా తెలుసు?"

"అప్పుడు మేం అక్కడే వున్నాం."

"కానీ నేను మీ ఇంటికి ఫోన్ చేశానుకదా?"

"అవును, చేశారు. బార్ కూడా మాఇంట్లోనే వుంది."

"అంటే పావన్ మీఇంట్లో—మీఇంటినుంచి—"

లాల్ మళ్ళీ నవ్వాడు. "వెల్, పావనా అతని పేరు? గుడ్, నాపార్ట్‌నర్ జాన్ మీ పావన్‌లా మాట్లాడాడు. ఏదో వాసన పసిగట్టి వుంటాడు, అర్జంటుగా నిషా తెచ్చుకొని పావన్ అవతారమెత్తాడు. మీరతని వల్లో పడ్డారు! మీ మాటల్లో ఏదో గ్లోవ్స్ ప్రసక్తివచ్చినట్టు కూడా విన్నాను .... బహుశ వాటికోసమే వెళ్ళి వుంటాడు."

"పావన్ ఇంటికా?"

"అడ్రసు మీరే చెప్పివుండాలి"

"యూ రోగ్స్! రాస్కెల్స్! ఎంత మోసం చేశారు?"

"వెల్, ఇక ఆపండి. ఈ తిట్లూ, పొగడ్తలు అన్నీ మా కలవాటే. పట్టించుకోం—మీరు చాలా తెలివిగల వారు, మాధవి. మీరిద్దరూ కలిసి మమ్మల్ని బాగా ఆడించారు, బఫూన్స్‌ చేసి. ఇప్పుడు మీకు రక్షణలేదు. ఏ విధంగానూ రక్షించుకోలేరు. కాస్సేపట్లో జాన్ మీ బాయ్ ఫ్రెండ్‌తో—"

అప్పుడే కృష్ణన్ లోనికొచ్చాడు.

"వెల్, ఇన్స్పెక్టర్ వచ్చేశారు. మీరిద్దరూ ఇక ఆయనతో స్టేషన్ కెళ్ళిపోండి!" అనేసి ఊరుకున్నాడు లాల్.

కృష్ణన్ మాధవిని పరీక్షగా చూశాడు. "మీరిక్కడే స్టేట్ మెంట్ ఇస్తారా?"

"ఓ.హ్, ఏమిటీ న్యూసెన్స్! ఏమిటి వాగుతున్నారు? మీరు నామీద ఏమీ బనాయించలేరు! ఏదీ నిరూపించలేరు!" అంది మాధవి ఆవేశంగా.

"పొరబడకండి! మీ మీద అన్నీ నిరూపించగలం. ఏమంటారు, లాల్?"

లాల్ తలూపాడు అనాసక్తిగా.

"ఏం నిరూపిస్తారు? ఎలా నిరూపిస్తారు?" అర్చిందామె.

"ఆల్ రైట్. అయితే వినండి, మాధవిగారూ!.... రాత్రి మీవారితో నా ఫోన్ సంభాషణ ఎక్స్టెన్షన్లో విని, లేదని బుకాయించినప్పుడే మీమీద అనుమానం కల్గింది. అప్పటివరకు మీమీద దృష్టిపోలేదు. అప్పుడే సస్పెక్ట్ లిస్టులో మీరు కూడా చేరిపోయారు.

"ఈమధ్య మీరు మీ వారిని కనిపెడ్తున్నారు. జాగ్రత్తగా మసలుకొంటున్నారు. కాని ఒక చిన్న పొరపాటు చేశారు. తీవ్రమైన పొరపాటు. అదే ఆయన ప్రాణం తీయడానికి మిమ్మల్ని పురిగొల్పింది. అంతా అనూహ్యంగా క్షణాల్లో జరిగిపోయింది పిడుగుపాటులా. మీమధ్య ఘర్షణ రగిలి, ఆ క్షణికావేశంలో మీరాయన తలమీద దేనితోనో కొట్టి—కొట్టి—కొట్టి—చంపేశారు."

మాధవి ఊపిరి బిగబట్టింది.

లాల్ తల విదిలించాడు, "అప్పుడే ముగింపు చెప్పేశానా! వెల్, అది సరైన ముగింపుకాదు. ఇప్పుడు వినండి. మీకో బాయ్ ఫ్రెండ్ వున్నాడు. అతన్ని ప్రేమిస్తున్నారు. మీరతని అడ్రసు చెప్తున్నప్పుడు జాన్ ఇంటి నెంబర్ టీపాయ్‌మీద గీశాడు. ఆ వార్డ్ నెంబర్ మెహదీ పట్నంలో ఒక వీధి. మెహదీ పట్నం నాకు బాగా తెలుసు. ఆ వీధిలో అంతా మధ్యతరగతి కుటుంబాలూ, వర్కింగ్ క్లాస్ వాళ్ళూ నివశిస్తున్నారు. కాబట్టి మీ బాయ్ ఫ్రెండ్ కూడా ఆ తరగతులకి చెందినవాడై వుండాలి. మీరు లక్షాధిపతి పత్ని. అతను సామాన్యుడు. మీ మధ్య ఈ అంతరాలున్నాయి. కానీ మీ ప్రేమముందు అవి నిలబడలేవు. మీ ప్రేమ అంత గొప్పది.

"అతని కోసం మీ భర్తకు ద్రోహం చేశారు. చివరికి ప్రాణాలు తీశారు. మీకు భర్తా, అతని ఆస్తి ముఖ్యమనిపించలేదు. మీ ఫ్రెండ్ సాన్నిధ్యం కావాలి. జీవితం అతనితో సాగాలి....కాబట్టి అతనితో ఎక్కడికైనా వెళ్ళిపోవాలి, లేదా అధికంగా అతన్ని పైకి తేవాలి. ఏది చెయ్యాలన్నా డబ్బు అవసరం. అందువల్ల ఈ ఉపాయం ఆలోచించారు. మీ భర్తని బ్లాక్ మెయిల్ చేశారు. ఈ బ్లాక్ మెయిల్‌కు నే చెప్పిన మోటివ్ సరైనది కాకపోవచ్చు. అది నా వూహ. ఇక్కడ నిరూపించవల్సింది మీమీద హత్యను."

మాధవి రెప్ప వేయకుండా చూస్తోంది. మాట్లాడలేదు.

లాల్ అన్నాడు. "డబ్బుకోసం మీవాళ్ని మీ ఫ్రెండ్‌తో బ్లాక్ మెయిల్ చేశారు. మీవారి బలహీనతలు మీకు తెలుసు. వాటిని ఎక్స్‌ప్లాయిట్ చేశారు. వారం

క్రితం మీరు ఊరికెళ్ళి మూడు రోజుల తర్వాత వచ్చారు. అది మీ పథకంలో భాగం. మీరు వెళ్ళిన రోజు రాత్రి మీ వారు మాధురి అనే డాన్సర్‌తో ఇంటికొచ్చారు. అలా వస్తారని మీకు తెలుసు. అందువల్ల వెళ్ళేముందు మీరు ఆయన విస్కీలోను, జిన్‌లోనూ మత్తుపదార్థం ఏదో కలిపి వెళ్ళారు. వాళ్ళు దాన్ని తాగేసి నిద్ర పోయాక, సావన్ కెమెరాతో వచ్చి కావల్సిన భంగి మల్లో స్నాప్స్ తీసుకొన్నాడు."

కృష్ణన్ కుతూహలంగా వింటున్నాడు.

"స్నాప్స్ తీసుకొని, మందుకలిపిన సీసాల్లోని విస్కీ, జిన్‌లను పారబోసి, వెంటతీసుకువచ్చిన స్వచ్ఛమైన అవే బ్రాండ్ డ్రింక్స్‌ని ఆ సీసాల్లో అదే మేరకు నింపి, యథా స్థానాల్లో పెట్టేశాడు.

"ఈ వ్యవహారానికి సంబంధించి మీరూ, మీ ఫ్రెండ్ వేలిముద్రలు పడకుండా గ్లోవ్స్ ఉపయోగించారు.

"ఆ తర్వాత నాలుగు రోజులకి ఫోటోలందాయి. అయిదు లక్షలకి డిమాండ్ చేశారు. ఈ రోజు రాత్రి వరకు గడువిచ్చారు. నిన్న ఉదయం ఆయన నన్ను కలి శారు. ఈ పని ఎవరో ప్రొఫెషనల్ చేసి వుంటాడను కున్నాంగానీ, స్వంత మనిషి అనుకోలేదు. డిటెక్షన్ ప్రారంభించాం. కాని ఎటువంటి క్లూ దొరకలేదు. నిన్న సాయంత్రం జాన్ ఇక్కడికొచ్చి ఫ్రిజ్‌లో సీసాలన్నిటి మీదా వేలిముద్రలు సేకరించాడు. వాటిలో మీ భర్తవి తప్ప మరెవరివీ లేవు. మాధురిని అనుమానించాం. కాని ఆమె నిర్దోషిగా తేలింది....

"చాలా నిరాశ చెందాం. అప్పుడే మీరు రంగంలో ప్రవేశించారు__వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టు మీరు

వెలుగులోకి వచ్చారు. ఎక్స్‌టెన్షన్‌లో మా మాటలు వినే తెలివితక్కువ పనిచేసి—అంటే వినకూడదనికాదు. ఆయన కదలికల్ని కనిపెడుతుండాలి కాబట్టి విని తీరాలి. అయితే వినేపద్ధతి మీకు తెలియదు. లేక కంగారులో మీరు పట్టించుకోలేదు. లైను పూర్తిగా డెడ్ అయ్యేవరకు ఆగవల్సింది—కాని మీరు మధ్యలో ఫోను పెట్టేసి నన్ను ఎలర్టు చేశారు. దొరికిపోయారు.

"మీ భర్త మాటలు విని, ఆయన ఫోన్ మీద ఏం చూశారన్న కంగారుతో ఆయన గదిలో కురికారు. అక్కడాయన ఫోన్ మీద లిప్‌స్టిక్ ముద్ర చూశారు. ఏమంటారు? సాయంత్రం ఆయన ఆఫీసునుంచి త్వరగా వచ్చేస్తున్నట్లూ, ఫలానా చోటుకి కలిసి వెళ్ళాలనీ ఫోన్ చేశారనుకుంటాను. అవునా? అప్పుడు ఈ విషయం వెంటనే మీరు సావన్‌కు తెలియజేశారు. అప్పుడతనితో మాటల్లో వీడ్కోలు చెబుతూ ముద్దు అందించి వుంటారు- మీ లిప్‌స్టిక్ మౌత్ పీస్‌మీద పడింది."

మాధవి కళ్ళు విశాలమై, నిశ్చలంగా వుండిపోయాయి.

"కానీ మీరది గమనించలేదు. రాత్రి మీరొచ్చాక నాకు ఫోన్ చేసినప్పుడు అది ఆయన కంటపడింది. కానీ దానిగురించి చెప్పకుండా గాభరాగా లైను కట్ చేసేశారు. అప్పుడే మీరు గదిలోకొచ్చారు. మిమ్మల్ని చూసి ఆయన ఉగ్రుడయ్యారు. మిమ్మల్ని అనుమానిస్తుండవచ్చు. సావన్ గురించి తెలిసివుండవచ్చు—ఫోన్ మీద ఆ మరక బొటనవ్రేలితో తుడిచి అదేమిటని మీకు చూపించారు. మీరు బెదిరిపోయారు. ఏమీ చెప్పలేకపోయారు.

"అప్పుడాయన ఇంకా రెచ్చిపోయారు. మీరు ముద్దును ఆయన కందించిందని బుకాయించలేరు. మరి

ఎవరిచ్చారు? ఆడస్నేహితుల కనడం ఎబ్బెట్టుగా వుంటుంది. సావన్‌తో మీ వ్యవహారం ఇప్పుడు రుజువవుతోందని ఆయన అన్నారు. మీరు వ్యతిరేకించారు. వాదించారు. గొడవ పెరిగింది. ఇద్దరూ పెనుగులాడారు. ఆయన మిమ్మల్ని కొట్టారు. మీరు తిరగబడ్డారు. అప్పుడు ఆవేశంతో దేనితోనో ఆయన తలమీద ఆగకుండా బాద సాగారు. ఆయిన కుప్పకూలిపోయారు.... అంతే మరిక లేవలేదు. మీరు భయపడి చేతిలో వస్తువు విసిరికొట్టారు. ఆయన చనిపోయారు. వెల్, మీరు దేనితో కొట్టారు?" అని ఆగాడు లాల్.

ఆమె ముఖం మాడిపోయింది. మాట్లాడలేకపోయింది.

లాల్ చుట్టూ చూశాడు. సిగరెట్ నలిపేసి లేచి తిరిగాడు. గదిని తృణ్ణంగా చూస్తూ బెడ్ క్రింద వంగి చూశాడు. వెంటనే అక్కడ కూర్చుండిపోయాడు.

"వెల్, వెల్, వెల్! అదేమిటి? అదే ఆయన ప్రాణాలుతీసింది!" అంటూ కర్చీఫ్‌తో దాన్నందుకొని కృష్ణన్‌కు చూపాడు.

"పేపర్ వెయిట్!" అన్నాడు కృష్ణన్.

"దట్స్ రైట్. దీనితోనే కొట్టివుండాలి." అంటూ దాన్ని కిటికీ దగ్గర పరీక్షగా చూశాడు లాల్, "వెల్, నూనెమరకలు కన్పిస్తున్నాయి.... పేపర్ వెయిట్స్‌ని ఇలా నిర్లక్ష్యంగా ఎవరూ పారేసుకోరు. నూనెమరకలు దుమ్మూ ధూళీ కాయితాల్ని పాడుచేస్తాయి. కృష్ణన్, దీనిమీద రావ్ తలనూనె, మాధవి వేలిముద్రలు లభిస్తాయి, ఉంచుకోండి."

కృష్ణన్ అందుకున్నాడు. మాధవి ఇంకా అలాగే వుంది.

"ఓ.కే!" లాల్ అన్నాడు మళ్ళీ, "జరిగింది గ్రహించి మీరు తారెత్తిపోయారు, మాధవి. వెంటనే సావన్‌కు ఫోన్ చేసి రమ్మన్నారు. ఈ మధ్య రెండుసార్లు ఫోన్ మ్రోగింది. ముందు నేను చేశాను. కానీ ఇక్కడ ఘర్షణ జరుగుతుండడంవల్ల రెస్పాన్స్ ఇవ్వలేదు. తర్వాత జాన్ చేసినపుడు ఇక్కడంతా అయిపోయింది....అప్పుడు మీ వారు బయటికెళ్ళిపోయారని మీరన్నారు. మేం ఎక్కడ వస్తామోనన్న భయంతో మీవారు ఇంట్లోలేరని సూచించడానికి వెంటనే కారెక్కి ఇంటివెనుక డ్రైవ్ చేసి అక్కడ ఆపారు. పెరటిదారిగుండా లోనికొచ్చారు. ఈలోపు సావన్ కూడా వచ్చేశాడు. మీరిద్దరూ ఈ గదిలో మా కోసం కాచుకున్నారు; శవం మంచంక్రింద తోశారు.

"అప్పుడు నేనొచ్చాను," లాల్ ఇంకా కొనసాగిస్తూ అన్నాడు, "నన్ను క్రింద హాల్లోనే ఆపడానికి మీరు శాయశక్తులా ప్రయత్నించి సఫలమయ్యారు. ఈ గదిలో కొచ్చి ఫోన్‌ని చూడనివ్వలేదు. మీ ప్రవర్తన, వేషం, వాలకం నా కనుమానం కల్గించాయని మీరు గమనించారు. నేను వెళ్ళిపోయాక, రహస్యంగా వస్తానని అనుమానించారు.

"అందువల్ల మాధవిగారూ, 'ఈ గదిలో ఏముందన్న నా క్యూరియాసిటీని తీర్చడానికి' మీరు చక్కని సన్నివేశం సృష్టించారు. సావన్ ఈ గదిలోంచి వెళ్ళిపోయాడు.అతను తాగిన సిగరెట్లు ఆష్‌ట్రేలో వున్నాయి. టీపాయ్‌మీద విస్కీ గ్లాసులున్నాయి. గ్రాంఫోన్ సన్నగా పెట్టారు....ఇవన్నీ సిద్ధంచేసి, నా రాకను పసిగట్టి అప్పుడు మీరు గదిలో ప్రవేశించారు డాన్సు

చేస్తూ. నేను గమనిస్తున్నానని తెలిసి సిగరెట్ ముట్టించు కున్నారు.

విస్కీ—కూడా తాగారు. సౌండ్ పెంచి డాన్సు ఉధృతం చేశారు. అదంతా చూసి నేను నిజమే కాబోలు అనుకొంటానుగానీ, 'మంచం క్రింద శవం వుంద'ని ఎలా అనుకుంటాను? అందుకే మీరు గదిలోకి రానివ్వలేదని ఎలా వూహిస్తాను!"

మాధవి ముఖంలో రక్తం వేగంగా ప్రసరించింది.

"అలా ఆపారం చేసుకొని నేను వెళ్ళిపోయాను. అమాయకుడ్ని. అది చూసి పావన్ పెరటిదారిగుండా వెళ్ళి కారు తెచ్చి ఇంట్లో పెట్టాడు. అయితే మీ భర్తని గాలించి మళ్ళీ మేం మీ ఇంటికి రావచ్చని వూహించారు. అందువల్ల మీరు మరో దృశ్యం సృష్టించి నన్ను ఫూల్ చేశారు."

"ఏం చేశాను?" మొదటిసారి పలికింది। మాధవి. పేలవంగా.

"మీ భర్త మేం అనుకొన్నట్లు మాధురిని కలుసుకో లేదు. కాబట్టి ఫోన్ మీద ఏదో సూచనతో బ్లాక్ మెయిలర్ ఎవరో తెలిసిపోయి, అతన్ని నేరుగా కలుసు కున్నారనుకున్నాం.

అందువల్ల ఆయన రాకకోసం మీ ఇంటివద్ద నిఘా వేయాలనుకున్నాను. అప్పుడు కారుని మీ ఇంటి వెనుక ఆపాలని ఆ వీధిలోకి డ్రైవ్ చేశాను. అక్కడ—పెరటి తలుపు దగ్గర పేడలో టైర్ ప్రింట్స్ కన్పించాయి. అనుమానంతో ఇంట్లోకి వచ్చిచూస్తే లోపల కారుంది. టైరుకి పేడ లోపల మట్టి, బావిదగ్గర అడుగుజాడలు— ఇవి చూసి ఆయనేదో గూడుపుఠాణీ సాగించారను

కున్నాను. అప్పుడు బాల్కనీలో ఎక్కి ఆ కిటికీలోంచి చూశాను. మీరిద్దరూ నిద్రపోతూ కన్పించారు...

“కానీ మీరు నిద్రనటిస్తున్నారనీ, మీ ప్రక్కన మీ వారు శాశ్వత నిద్రలో వున్నారని నేనప్పుడు తెలుసుకోలేకపోయాను!”

“ఏమిటీ! ఆయన శవం ప్రక్కన పడుకోబెట్టి—” కృష్ణన్ అర్చాడు.

“చూడండి, ఆమె ఎంత తెలివిగా ప్రవర్తించిందో! సమయానుసారంగా సన్నివేశాల్ని సృష్టించింది. ఆ సమయంలో రావ్ సజీవంగా వున్నాడని నన్ను నమ్మించి, నన్నే సాక్షిగా ఎలిబీ సృష్టించుకోవాలనుకుంది. కానీ మెడికల్ ఎవిడెన్స్ గురించి ఆలోచించలేదు. వెల్, నేను ఇంటికెళ్ళిపోయి ఫోన్ చేస్తే ఆయన తిరిగివచ్చి నిద్రపోతున్నారనీ, లేపడం ఇష్టంలేదనీ అబద్ధమాడింది.

“ఇహ వీళ్ళకి ప్రమాదం తొలగింది. శవాన్ని ఏదో ఒకటి చెయ్యాలి. ఈ హత్య వీళ్ళ మెడకి చుట్టుకోకూడదు. కాబట్టి దాన్ని ఆత్మహత్యగా రూపొందించాలనుకున్నారు. పరిస్థితులన్నీ చక్కగా సరిపోతాయి. రావ్ బ్లాక్ మెయిల్‌లో ఇరుక్కున్నాడని మాకు తెలుసుగాబట్టి వ్యవహారం బెడిసి అవమాన భారంతో ఆత్మహత్య చేసుకున్నాడని మేమనుకొంటామనుకొన్నారు. ఈ ఆలోచనతో ఆయన మెడకి తీగచుట్టి—”

బయట అడుగులు విన్పించడంతో లాల్ ఆగిపోయాడు.

అందరూ ద్వారంకేసి చూశారు.

“మెడకి తీగచుట్టినంతమాత్రాన ఆత్మహత్య అంటే ఎవరు నమ్ముతారు, చుట్టినవాళ్ళు తప్ప?” అన్నాడు జాన్

లోనికొస్తూ, "హలో! ఇన్స్పెక్టర్."

"హలో ఫ్రెండ్, ఇట్స్ సో గుడ్ మార్నింగ్."

"అండ్ ఎ సక్సెస్‌ఫుల్ మార్నింగ్. మీట్ అవర్ ఫ్రెండ్ మిస్టర్ పావన కుమార్."

జాన్ ప్రక్కన ఒక ముప్పైఏళ్ళ యువకుడు ఎవరితోనూ కళ్ళు కలుపలేక, నేల చూపులు చూస్తూ నిల్చున్నాడు.

మాధవి అతన్ని దిగ్గున తలెత్తి చూసి, చూపులు మరల్చుకొంది.

"వెరీ వెల్, జాన్! మీకోసమే ఎదురు చూస్తున్నాం" అన్నాడు లాల్.

జాన్ నవ్వాడు, "క్లూ.... నే చెప్పిన క్లూ ఏమైంది?"

"అక్షరాల నిజమైంది, అది స్థానంమారి రావ్ బొటనవేలి కంటుకుంది."

"ఈజిట్? అయితే ఇవిచూడు. గ్లోవ్స్, నెగటివ్స్" జాన్ అందిస్తూ అన్నాడు, "నేనలా ఫోన్‌లో అమర్యాదగా మాట్లాడినందుకు మాధవిగారు క్షమించరనుకుంటాను."

"యూ ఆర్ రోంగ్ —"

"ధన్యుణ్ణి."

"వెల్, ఇక ఆపండి!" లాల్ అడ్డుకున్నాడు, గ్లోవ్స్ పరిశీలిస్తూ. అవి అక్కడక్కడ చిరిగివున్నాయి.

నెగెటివ్స్‌లో రావ్ — మాధురి భంగిమలున్నాయి.

"వెల్, మాధవి. నే చెప్పిన ఆలోచనతో శవం మెడకి తీగచుట్టి ఈ గవ్స్‌తో లాగాడు మీ ఫ్రెండ్. తర్వాత ఇద్దరూ మోసుకెళ్ళి పెరట్లో వ్రేలాడదీశారు. అయితే అతి సామాన్యమైన విషయాల్ని విస్మరించారు.

మీ ఫ్రెండ్ వొట్టిచేతులతో తీగలాగితే గీరుకుపోతాయనుకున్నప్పుడు, రావ్ లాగినప్పుడు కూడా గీరుకుపోవాలని తట్టలేదనుకొంటాను. పైగా తీగను చేతికి చుట్టారు. అంతేగాక ఈ గ్లోవ్స్ నాశనం చెయ్యడం కూడా బాధకమనిపించిందనుకొంటాను. ఇలాంటి ఎన్నో పొరపాట్లు లోపాలతో ఈ హత్యను ఆత్మహత్యగా పకడ్బందీగా సృష్టించలేకపోయారు.

"ఒక విషయం గుర్తుంచుకోండి. హత్యనెవరూ ఆత్మహత్యగా నిరూపించలేరు. నేర పరిశోధన సైంటిఫికల్‌గా చాలా అభివృద్ధి చెందింది—లీగల్ మెడిసిన్ ప్రాధాన్యత సగటు నేరస్థుడికి తెలియదు. సర్క్యూమ్‌స్టేన్షియల్ ఎవిడెన్స్‌ని సృష్టించగలరుగానీ, మెడికల్ ఎవిడెన్స్‌నెవరూ మార్చలేరు!"

లాల్ టైము చూసుకొని లేచి నిలబడ్డాడు. "దట్సాల్, కృష్ణన్. ఇక మిగిలింది నీ వంతు."

కృష్ణన్ తలూపి లేచాడు, "ఇన్‌స్టెంట్ కాఫీలా కేసు తేల్చేశారు!" అన్నాడతను.

జాన్ నవ్వాడు, "భూటన్ విస్కీలా కామెంట్ చేశారు, థాంక్స్!"

లాల్ ఓసారి మాధవినీ, సావన్‌నీ చూసి వెనుదిరిగాడు.

—:ఐపోయింది:—